వైరాకు నిలిచిపోయిన
సాగర్ జలాలు
12.9 అడుగులకు పడిపోయిన నీటిమట్టం 6






ఏసీబీకి పట్టుబడిన ప్రధానోపాధ్యాయుడు రవీందర్

# పెద్దసారు కక్కుర్తి

- కరాటే శిక్షకుడి నుంచి రూ.20వేల లంచం తీసుకుంటుండగా పట్టుకున్న ఏసీబీ అధికారులు
- రూ.30వేల పారితోషికంలో రూ.20వేలు లంచం ఇవ్వాలని వేధింపులు
- విసిగి వేసారి ఏసీబీని ఆశ్రయించిన బాధితుడు
- రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిన లంచగొండి
- కొత్తగూడెంలో కలకలం

6

# లింగ నిర్ధారణ ముఠా గుట్టు రట్టు

- ఇద్దరి అరెస్టు.. పరారీలో మరొకరు

చింతకాని, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): చట్ట విరుద్ధంగా గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు చేపడుతున్న ఆర్ఎంపీ ముఠా గుట్టు రట్టయింది. ఖమ్మం పరిధిలోని బల్లేపల్లికి చెందిన ఆర్ఎంపీ చారి, చింతకాని మండలం కొదుమూరుకు చెందిన ఆర్ఎంపీ రాచబంటి మనోజ్, అల్లీపురానికి చెందిన (మిగతా 6వ పేజీలో)

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కోట్లాది రూపాయల ఖర్చుతో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలు నామమాత్రంగా మారుతున్నాయి. ఏడాదికేడాది పిల్లలు తగ్గిపోతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఒకప్పుడు కనీసం 25 మంది పిల్లల వరకు ఉండే పరిస్థితి ఉండగా, ఇప్పుడు 5 నుంచి 10 మందికి మించడంలేదు. ఉదయం 9 గంటలకు మొదలై సాయంత్రం 4 గంటల వరకు కొనసాగే ఈ కేంద్రాల్లో సమయపాలన ఉండడంలేదు. కొన్ని సెంటర్లు ఆలస్యంగా తెరుస్తుండగా, మరికొన్ని చోట్ల తల్లిదండ్రులు పిల్లలను సమయపాలనకు అనుగుణంగా పంపడంలేదు. ఇష్టం వచ్చినప్పుడు పంపడం, మళ్లీ తీసుకెళ్లడం జరుగుతోంది. దీంతో అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటాపాటలతో పాటు పూర్వ ప్రాథమిక చదువులకు పిల్లలు దూరమవుతున్నారు. ఇది ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పలుచోట్ల జరుగుతున్న తంతు.



ఖమ్మం లెనిన్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు

# ఆటా లేదు.. పాటా లేదు...

## నామమాత్రంగా మారిన అంగన్‌వాడీ కేంద్రాలు

- ఏడాదికేడాది తగ్గిపోతున్న పిల్లలు
- ఆదరణ లేని చోటు నుంచి ఇతర ప్రాంతాలకు అంగన్‌వాడీల తరలింపు
- మారుతున్న కాలానికి అనుగుణంగా రూపు సంతరించుకోని కేంద్రాలు
- పిల్లలను పంపడం నామోషీగా భావిస్తున్న మధ్య తరగతి వర్గాల ప్రజలు
- సుముఖంగా లేని బాలింతలు, గర్భిణులు
- కోడిగుడ్డు, భోజనం సమయానికే వస్తున్న పిల్లలు
- కొన్నిచోట్ల పక్కదారి పడుతున్న ఆహార పదార్థాలు
- జిల్లాలో మొత్తం అంగన్‌వాడీ కేంద్రాల సంఖ్య 1840

ఖమ్మం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఖమ్మం నగరంలోని మామిళ్లగూడెంలో పలు అంగన్‌వాడీ కేంద్రాలను శుక్రవారం విజిట్ చేయగా వాస్తవ పరిస్థితులు వెల్లడయ్యాయి. మామిళ్లగూడెంలోని అంగన్‌వాడీ కేంద్రం-4లో ఒకప్పుడు పదిమందికిపైగా పిల్లలుండగా క్రమంగా పిల్లల సంఖ్య నాలుగుకు చేరింది. దీంతో ఐసీడీఎస్ అధికారులు ఈకేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సూచన మేరకు రామన్నపేట డబుల్‌బెడ్‌రూం కేంద్రానికి తరలించారు ఇక్కడున్న నలుగురు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించగా, మరో ఇద్దరు పిల్లలు సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రం-6లోకి బదిలీ చేశారు ఇక్కడ టీచర్‌ను బైపాస్‌రోడ్డులోని కూరగాయల మార్కెట్ సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రానికి బదిలీ చేశారు. అక్కడున్న ఆయాను చర్చి కాంపౌండ్‌కు బదిలీచేయగా, ప్రస్తుతం ఈసెంటర్‌కు సంబంధించిన పాత స్టాకు రావడంతో అంగన్‌వాడీసెంటర్ 6లోనే ఆయాకూడా సేవలందిస్తున్నారు.

### 12 మందికి ఏడుగురే.....

అంగన్‌వాడీ కేంద్రం ఆరులో మొత్తం 12మంది వరకు చిన్నారులుండాల్సి ఉండగా 10-30 గంటల సమయంలో నలుగురు మాత్రమే ఉన్నారు. ఆ తర్వాత టీచర్, ఆయా ఫోన్లు చేసి చెప్పడంతో తల్లిదండ్రులు చిన్నారులను తీసుకువచ్చారు. మొత్తం ఏడుగురు వచ్చారు. మామిళ్లగూడెం అంగన్‌వాడీ కేంద్రం-3 సెంటర్ పరిశీలించగా 10మంది ఉండాల్సి ఉండగా.. ఇద్దరు మాత్రమే ఉన్నారు. అంగన్‌వాడీ టీచర్లకు సెక్టార్ (మిగతా 6వ పేజీలో)

### అన్నీచోట్ల అదే పరిస్థితి...

అంగన్‌వాడీ కేంద్రాల్లో సర్వే లెక్కలకు వాస్తవ పరిస్థితికి భిన్నమైన గణాంకాలు కనిపిస్తున్నాయి. అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో గర్భిణీలు, బాలింతలు ఏడునెలల నుంచి 3 ఏళ్ల వయస్సున్నపిల్లలు, 3 నుంచి ఆరేళ్ల పిల్లలకు సేవలందించాల్సి ఉంది. అయితే సెంటర్‌లో రిజిస్టర్ నమోదులో పిల్లల సంఖ్య, తల్లుల సంఖ్య కనిపిస్తున్నా హాజరుశాతం మాత్రం తక్కువగా ఉంటుంది. ఆరేళ్ల పిల్లలకు మాత్రం కేంద్రంలోనే పౌష్టికాహారం అందించాలి. బాలింతలు కూడా తినే వెళ్లాలి. అయితే చాలామంది అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చి తినివెళ్లడంలేదు. ఇంటికి తీసుకెళ్లి తింటున్నారు. బాలింతలు, గర్భిణీలు వారు కూడా ఎక్కువమంది రావడంలేదు. తమ కుటుంబసభ్యుల ద్వారా తెప్పించుకుంటున్నారు.

# టెన్నిస్‌లో మెరిసిన అధర్వశర్మ

- జాతీయస్థాయి సింగిల్స్ పోటీల్లో విజయదుందుభి
- రన్నరప్‌గా ఓగేస్ తేజో జయప్రకాశ్



సింగిల్స్ ప్రథమ విజేత అధర్వశర్మ, ద్వితీయ విజేత ఓగేస్ తేజో జయప్రకాశ్

ఖమ్మం స్పోర్ట్స్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : ఖమ్మం నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో జరుగుతున్న ఆల్‌ఇండియా ఓపెన్ టెన్నిస్ పోటీలు ముగిశాయి. సింగిల్స్ పోటీలో విజేతగా అధర్వశర్మ (మహారాష్ట్ర) నిలవగా, ఓగేస్ తేజో జయప్రకాశ్(తమిళనాడు) రన్నరప్‌గా నిలిచాడు. శుక్రవారం జరిగిన ఉత్కంఠ ఫైనల్ మ్యాచ్‌లో అధర్వశర్మ (మహారాష్ట్ర) 1-6, 6-3, 6-3 స్కోరు తేడాతో ఓగేస్ తేజో జయప్రకాశ్ (తమిళనాడు)పై విజయం సాధించి టైటిల్‌ను నిలబెట్టుకున్నాడు. అంతకుముందు గురువారం జరిగిన డబుల్స్ విభాగం పోటీలో విజేతలుగా తీర్థ శశాంక్ మాచర్ల(తెలంగాణ), అధర్వశర్మ (మహారాష్ట్ర)జోడీ నిలిచిన సంగతి తెలిసిందే. అంతేకాకుండా సిగిల్స్‌లోనూ, డబుల్స్‌లోనూ మహారాష్ట్రకు చెందిన టాప్ సీడెడ్ క్రీడాకారుడు అధర్వశర్మ విజేతగా నిలవడం విశేషం. పోటీల అనంతరం విజేతలకు జిల్లా టెన్నిస్ అసోసియేషన్ బాధ్యులు, వీవీసీ గ్రూప్ ఛైర్మన్ వంకాయలపాటి రాజేంద్రప్రసాద్ బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఎం.వెంకటరమణ, శ్రీనివాస్, డాక్టర్ అనిల్ ఉన్నారు



కూసుమంచి మండలం పోచారం వద్ద టన్నెల్‌ను పరిశీలిస్తున్న అధికారులు

# సీతారామ టన్నెల్‌పై నజర్

- ఎస్ఎల్‌బీసీ ప్రమాదం నేపథ్యంలో పరిశీలించిన అధికారులు

6



హరిప్రసాద్ (ఫైల్)



పవన్ కుమార్(ఫైల్)

# రామయ్య దర్శనానికి వచ్చి...

- గోదావరిలో మునిగి ఇద్దరు యువకుల మృతి
- మృతులిద్దరూ బావ బావమరుదులు
- ఒకరిది ఖమ్మం...మరొకరిది వికారాబాద్ జిల్లా

భద్రాచలం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : భద్రాచలంలో శుక్రవారం రామయ్య దర్శనానికి వచ్చి గోదావరి నదిలో స్నానం చేస్తూ ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు యువకులు ప్రాణాలు కోల్పోయారు. మృతులిద్దరూ బావ, బావమరుదులు అవుతారు. వికారాబాద్ జిల్లా దారూర్ మండలం అర్డాస్‌పల్లికి చెందిన పత్తి నర్సింహులు, భీమమ్మ దంపతులు మూడు రోజుల క్రితం ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం రేగులచిలకలోని తన చెల్లెలు రోపాకుల మంజుల ఇంటికి వచ్చారు. మంజులకు ఒక కమారుడు పవన్‌కుమార్ వున్నారు. శుక్రవారం నలుగురు కలిసి రామయ్య దర్శనం కోసం భద్రాచలం బయలుదేరారు. సుజాతనగర్‌లో బి-ఫార్మసీ చదువుతూ కొత్తగూడెంలో హాస్టల్‌లో ఉంటున్న నర్సింహులు కుమారుడు హరిప్రసాద్ వారితో కలిశాడు. ఐదుగురు సాయంత్రం భద్రాచలం చేరుకున్నారు.



రోదిస్తున్న కుటుంబ సభ్యులు

ఈ క్రమంలో స్నానం చేసేందుకు నర్సింహులుతో పాటు పవన్‌కుమార్, హరిప్రసాద్ గోదావరిలోకి దిగారు. అయితే లోతును అంచనా వేయకపోవడంతో వారు ముగ్గురూ నీటిలో మునిగిపోయారు. ఈ క్రమంలో అక్కడే వున్న గజ ఈతగాళ్లు నర్సింహులును ఒడ్డుకు చేర్చారు. అయితే పవన్‌కుమార్ (20), హరిప్రసాద్(21) మాత్రం కనిపించలేదు. కొద్దిసేపటి తర్వాత గాలించగా, ఇద్దరూ విగతజీవులుగా లభించారు. దీంతో రెండు కుటుంబాల వారు కన్నీరు మున్నీరుగా రోదించారు. కళ్లముందే కొడుకులను కోల్పోయామని గుండెలు బాదుకున్నారు. ఘటన సమాచారం అందుకున్న భద్రాచలం సీఐ బరపాటి రమేష్ తమ సిబ్బందితో అక్కడికి చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం భద్రాచలం ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. సొంత బావ బామ్మర్దులైన పవన్‌కుమార్, హరిప్రసాద్‌లు ఒకే కుటుంబానికి చెందిన వారు. ఇందులో పవన్‌కుమార్ వ్యవసాయ కూలీగా జీవనం సాగిస్తున్నాడు. హరిప్రసాద్ సుజాత్‌నగర్‌లోని కళాశాలలో బి-ఫార్మసీ చదువుతున్నాడు.



స్థల మ్యాప్‌ను పరిశీలిస్తున్న కేంద్ర సర్వే బృందం (ఫైల్)

# ఆశలకు రెక్కలొచ్చేనా!?

- కొత్తగూడెం ఎయిర్‌పోర్టుకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంలో కేంద్రం జాప్యం
- ఇంకా మొదలుకాని రెండో పర్యాయం సర్వే
- ఏఏఐ నుంచి ఎలాంటి సమాచారం లేదంటున్న అధికారులు
- వరంగల్‌లో ఎయిర్‌పోర్టుకు తాజాగా ఓకే చెప్పిన కేంద్రం
- కొత్తగూడెం విషయంలో మీనమేషాలపై ప్రజల అసంతృప్తి

కొత్తగూడెం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రమైన కొత్తగూడెం ప్రాంతంలో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు సాకారం ప్రశ్నార్థకంగా మారింది. కేంద్రం నుంచి ఇప్పటివరకు మంజూరు అనుమతులు రానే లేదు. జనవరి 23న కేంద్ర సర్వే బృందం కొత్తగూడెంలో స్థల పరిశీలన చేశారు. ఇది పూర్తయి నెలరోజులు దాటినా.. స్థల పరిశీలన కోసం సాంకేతిక నిపుణుల బృందం ఇప్పటివరకు జాడలేదు. ఆ బృందం నివేదిక సమర్పిస్తేనే ఎయిర్‌పోర్టు నిర్మాణం జరిగే అవకాశాలు ఉంటాయి. వరంగల్ జిల్లా మామునూరు ప్రాంతంలో విమానాశ్రయానికి కేంద్ర ప్రభుత్వం నుంచి గ్రీన్‌సిగ్నల్ లభించినట్టు ఆర్అండ్‌బీ శాఖ మంత్రి కోమటరెడ్డి వెంకటరెడ్డి శుక్రవారం ప్రకటించారు. ఈ నేపథ్యంలో మరి కొత్తగూడేనికి అనుమతులు ఎప్పుడు వస్తాయని ప్రజలు ఎదురుచూస్తున్నారు. కొత్తగూడెంలో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడికి లేఖలు రాయడమే కాకుండా, స్వయంగా ఆయనను కలిసి కొత్తగూడెంలో ఎయిర్‌పోర్టు ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి కూడా కేంద్ర మంత్రికి లేఖలు రాశారు.

### సాంకేతిక బృందం వచ్చేనా...

మంత్రి, ఎంపీ ఎమ్మెల్యేల వినతులకు స్పందించిన కేంద్ర మంత్రి (మిగతా 6వ పేజీలో)

# కాంట్రాక్టు కార్మికుడి హత్య

- మృతుడు మధ్యప్రదేశ్ రాష్ట్రం సిద్ది జిల్లా వాసి
- మణుగూరు ఏరియాలో ఘటన



విశ్వకర్మ (ఫైల్)



మృతదేహాన్ని పరిశీలిస్తున్న మణుగూరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి

మణుగూరు టౌన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని దుర్గా ప్రైవేటు ఓబీ కంపెనీలో పనిచేసే కాంట్రాక్టు కార్మికుడు దారుణ హత్యకు గురయ్యాడు. ఈ సంఘటన శుక్రవారం ఉదయం వెలుగులోకి వచ్చింది. ఓబీ కంపెనీ సమీపంలో ఉన్న గాంధీనగర్ శివారు ప్రాంతంలో ఓసీ-4 వాగు వద్ద మునిప్రసాద్ విశ్వకర్మ(30) మృతదేహాన్ని కనుగొన్నారు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న సీఐ సతీష్ కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఓ పెద్ద బండరాయితో విశ్వకర్మ తలపై మోది హత్య చేసినట్టు గుర్తించారు. సంఘటనా స్థలం వద్ద పేకముక్కలు, మద్యం సీసా, పెద్ద ముళ్లు ఉన్న కర్ర ఉండగా, మంచం నవ్వారు మృతుడి మెడకు చుట్టి ఉంది. దీంతో ఈ మృతి అనుమానాస్పదంగా మారింది. మునిప్రసాద్ మధ్యప్రదేశ్ రాష్ట్రం సిద్ది జిల్లా గోహారి గ్రామానికి చెందిన వాడిగా పోలీసులు గుర్తించారు. గత ఐదేళ్లుగా మణుగూరు ఏరియాలోని దుర్గా కంపెనీలో మెకానిక్ హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. మణుగూరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. డాగ్ స్క్వాడ్‌ను రంగంలో దింపారు. హత్యకు కారణాలు తెలియరావడం లేదు. విచారణ అనంతరం వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు వున్నారు. వీరు మధ్యప్రదేశ్‌లో ఉంటున్నారు.

# ప్రాణాలు తీసిన ఇసుక దందా

- నిద్రిస్తున్న వారిపై నుంచి ట్రాక్టర్‌ను నడిపిన డ్రైవర్
- ఒకరు అక్కడికక్కడే, మరొకరు చికిత్స పొందుతూ మృతి
- ఇద్దరూ ఛత్తీస్‌గఢ్ వలస కూలీలే
- చర్ల మండలం తేగడలో ఘటన

చర్ల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమ రవాణా ఇద్దరు వలస కూలీల ప్రాణాలను బలిగొన్నది. ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం తేగడ గ్రామంలో శుక్రవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. చర్ల మండలం రాళ్లగూడేనికి చెందిన ముగ్గురు వ్యక్తులు కలిసి మూడు ట్రాక్టర్లు, ఓ ఎక్స్‌కవేటర్ సమీకరించుకుని తేగడ వద్ద గల ఇసుక క్వారీ నుంచి ఇసుక అక్రమ రవాణా ప్రారంభించారు. మూడు ట్రాక్టర్లు గురువారం అర్ధరాత్రి నుంచి దండుపేట గ్రామంలోని ఓ ఇంటికి ఈ ఇసుకను రవాణా చేస్తున్నాయి. ఇదే క్రమంలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుకుమా జిల్లా నుంచి వచ్చిన ఇద్దరు వలస కూలీలు ఆ



ఇసుక ట్రాక్టర్ తల పైనుంచి వెళ్లడంతో మృతిచెందిన సన్ను



చికిత్స పొందుతూ ఆస్పత్రిలో మృతిచెందిన శ్యామల సన్ను

ఇంటి నిర్మాణం జరిగే ప్రదేశంలో పక్కనే పడుకుని ఉన్నారు. వారిని గమనించని ఇసుక ట్రాక్టర్ డ్రైవర్... వాహనాన్ని వారిపై నుంచి తీసుకువెళ్లాడు. దీంతో కుంజం సన్ను (24) అక్కడికక్కడే మృతి చెందగా, మరో వ్యక్తి శ్యామల సన్ను(22) తీవ్ర గాయాలకు లోనయ్యాడు. అతడిని వెంటనే వరంగల్ ఎంజీఎంకు తరలించగా, చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. సన్ను గురువారం అర్ధరాత్రి గాయపడితే ఉదయం 8గంటల వరకు కూడా సంబంధిత ఇసుక ట్రాక్టర్ యజమానులు అతడిని వైద్యం కోసం తరలించలేదని, (మిగతా 6వ పేజీలో)


వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి 7



# క్లీన్ లకారం

- ట్యాంక్ బండ్‌పై స్వచ్ఛతా హీ సేవా
- స్పెషల్ డ్రైవ్‌లో పాల్గొన్న కేఎంసీ, స్వచ్ఛంద సంస్థలు, విద్యాసంస్థలు

ఖమ్మం సంక్షేమ విభాగం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం క్లీన్ లకారం ట్యాంక్ బండ్ కార్యక్రమం చేపట్టారు. ఖమ్మం నగర పాలక సంస్థ పారిశుధ్య కార్మికులతోపాటు వాకర్స్ అసోసియేషన్, 3 హెచ్ ఫౌండేషన్, న్యూ విజన్ ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు. లకారం ట్యాంక్ బండ్ పరిసర ప్రాంతాలను ఊడ్చి, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి క్లీన్ లకారంగా మార్చారు.





# ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

- రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి శాంతికుమారి
- ప్రశ్నపత్రాల తరలింపు పోలీసు బందోబస్తు మధ్య నిర్వహించాలి
- ఇంటర్ పరీక్షలు, ఎల్‌ఆర్‌ఎస్‌పై వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్ష



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

కొత్తగూడెం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ముఖ్య కార్యదర్శి శాంతికుమారి అన్నారు. శుక్రవారం సీఎస్ ఇంటర్ పరీక్షల నిర్వహణ, ఎల్‌ఆర్‌ఎస్‌పై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మార్చి 5 నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయని, పరీక్షల నిర్వహణకు అవసరమైన సిబ్బంది నియామకం, శిక్షణ పూర్తయిందని, ప్రశ్నపత్రాలు జిల్లాకు చేరుకున్నాయని, నేటినుంచి ప్రశ్నాపత్రాలు స్ట్రాంగ్ రూం నుంచి పోలీస్‌స్టేషన్లకు చేరుతాయన్నారు. ఇంటర్ పరీక్షల నిర్వహణపై సమన్వయ సమావేశాలు జిల్లాలో జరిగాయని, మేర ఫ్లైయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటుచేయాలని సీఎస్ సూచించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఇంటర్ పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశామని, ఫస్టియర్‌కు 9,255 మంది విద్యార్థులు, సెకండియర్‌కు 10,003 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు. జిల్లాలో మొత్తం 36 పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లు చేశామన్నారు. చీఫ్ సూపరింటెండెంట్లు 36 మంది, అడిషనల్ చీఫ్ సూపరింటెండెంట్లు 13 మంది, డిపార్టుమెంట్ అధికారులు 36మంది, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు మూడు, కస్టోడియన్ అధికారులు ఐదుగురు, ఇన్విజిలేటర్లు 550మంది, రెండు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు వైద్య సహాయం, అందించడానికి ఆను 72మంది ఏఎన్ఎంలను నియమించినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, ఆర్డీవోలు మధు, దామోదర్‌రావు, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి, ఎస్పీడీసీఎల్ ఎస్పీ మహేందర్, కొత్తగూడెం మునిసిపల్ కమిషనర్ శేషాంజన్‌స్వామి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# మున్నేరు రక్షణగోడల పనుల పరిశీలన

- హైదరాబాద్ నుంచి వచ్చిన సెంట్రల్ డిజైనింగ్ ఆర్గనైజేషన్ అధికారులు

ఖమ్మం కలెక్టరేట్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మున్నేరు రక్షణ గోడల పనులకు అనుసంధానంగా డిజైన్ చేసిన డ్రెయిన్ నిర్మాణ పనులను హైదరాబాద్ నుంచి వచ్చిన సెంట్రల్ డిజైనింగ్ ఆర్గనైజేషన్ అధికారులు శుక్రవారం పరిశీలించారు. ఈఈ చంద్రశేఖర్‌తో పాటు డీఈ, ఏఈల బృందం ఖమ్మం ఈఈలు మంగళపూడి వెంకటేశ్వర్లు, అనసీయ తదితరులతో కలిసి డ్రెయిన్ డిజైన్లను పరిశీలించారు. మున్నేరు రక్షణ గోడలతో పాటు ప్రకాష్‌నగర్ నుంచి దానవాయిగూడెం వరకు గోడ పక్కన 15అడుగుల రోడ్డు నిర్మాణం, దానికి అనుసంధానంగా నగరం నుంచి వచ్చే మురుగునీరు, వెళ్లేందుకు మున్నేరులో కలవకుండా తరలించేందుకు వీలుగా డ్రెయిన్ల నిర్మాణాలను చేపట్టాలంటూ రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జిల్లా నీటి పారుదల అధికారులకు ఆదేశాలిచ్చారు. ఈ నేపథ్యంలో నీటిపారుదల శాఖ అధికారులు డ్రెయిన్ల డిజైన్లను రూపొందించి ప్రభుత్వానికి నివేదించారు. ఈ నేపథ్యంలో ఆ డిజైన్లను పరిశీలించేందుకు నిపుణుల బృందం శుక్రవారం పరిశీలించారు. ప్రకాష్‌నగర్ వంతెనతోపాటు ఖమ్మం కాల్వొడ్డు సమీపంలో, దానవాయిగూడెం సమీపంలో మూడు ప్రాంతాల్లోనూ అధికారులు డ్రెయిన్ నిర్మాణ ప్రాంతాలను, డిజైన్లను పరిశీలించారు. తర్వాత వీరి నివేదికల ఆధారంగా ఆ పనులను చేపట్టనున్నట్లు తెలిసింది. వీరి వెంట జిల్లా అధికారులు మంగళపూడి వెంకటేశ్వర్లు, అనసీయతోపాటు రమేష్, ఉదయ్‌ప్రతాప్, మన్మధరావు తదితరులున్నారు.



ప్రకాష్‌నగర్ వంతెన వద్ద స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

# వృత్తి నైపుణ్య శిక్షణతో ఉపాధి అవకాశాలు

**కలెక్టర్ జితేష్ వీ పాటిల్**

పాల్వంచ, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): వృత్తి నైపుణ్య శిక్షణతో ఉపాధి అవకాశాలు లభిస్తాయని కలెక్టర్ జితేష్ వీ పాటిల్ అన్నారు. శుక్రవారం పాల్వంచ నవభారత్ ప్రాంతంలోని నవ ఒకేషనల్ ట్రైనింగ్ సెంటర్లో శిక్షణ పూర్తి చేసుకున్న ఐటీఐ విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టెన్త్ తర్వాత ఐదేళ్ల పాటు విద్యను కొనసాగించే ఆర్థిక వనరులు అందరికీ అందుబాటులో ఉండకపోవచ్చని, అటువంటి వారికి తక్షణ ఉపాధి కల్పించే వృత్తి విద్యా కోర్సుల ద్వారా విద్యార్థులు తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుని ఉద్యోగావకాశాలను పొందవచ్చని అన్నారు. కార్యక్రమంలో సీపీవో సంజీవరావు, ట్రైనింగ్ సెంటర్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వానరానికి అంత్యక్రియలు

**మానవత్వాన్ని చాటుకున్న సోమ్లాతండా యువకులు**

కూసుమంచి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మనిషి మరణిస్తే కుటుంబసభ్యులు తమ సాంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు నిర్వహిస్తుంటారు. బంధువులు, కుటుంబసభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆ వ్యక్తికి అంతిమ వీడ్కోలు పలుకుతారు. కన్న తల్లిదండ్రులనే పట్టించుకోని ఈ కాలంలో ప్రమాదవశాత్తు చనిపోయిన వానరానికి అంత్యక్రియలు నిర్వహించి మానవత్వాన్ని చాటుకున్నారు. కూసుమంచి మండలం భగత్‌వీడుతండా శివారు సోమ్లాతండాలో ఈ ఘటన చోటుచేసుకుంది. తమ ఇళ్ల మధ్యలో ఓ వానరం ప్రమాదవశాత్తు చనిపోయి ఉంది. దీంతో వానరాన్ని చూసి చలించిన తండా యువకులు పాడె కట్టి, డప్పుచప్పుళ్లతో, బొంగుపేలాలు, కుంకుమలు చల్లుతూ అంతిమయాత్ర నిర్వహించారు. మనుషులకు మాదిరిగానే స్మశానవాటికకు తీసుకెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు. ఆంజనేయుడికి ప్రతిరూపంగా భావించి తండావాసులు వానరానికి అంత్యక్రియలు చేసినట్టు తెలిపారు.



వానరానికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న యువకులు

# మూడు రోజులపాటు ఉపాధ్యాయులకు శిక్షణ

కొత్తగూడెంఅర్బన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో డీఎస్సీ-24 ద్వారా ఎంపికైన 258 మంది ఎస్జీటీ ఉపాధ్యాయులకు మూడు రోజుల పాటు వృత్యంతర శిక్షణ ఇవ్వనున్నారు. ఈ శిక్షణ శుక్రవారం జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి ఏ.నాగరాజశేఖర్ పర్యవేక్షణలో ప్రారంభమైంది. నూతన విద్యావిధానం, తరగతి గదుల్లో విద్యాబోధన, పరీక్షల విధానాలు, తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ కోసం రాజశేఖర్, శ్రీకాంత్, మంజుశ్రీ, గీతా, రాందాస్, అనిత, స్వరూప్‌కుమార్, రవికుమార్, శ్రీనివాసరెడ్డి, నాగులస్వామి, శంకర్, శోభన్‌లను రిసోర్స్‌పర్సన్లుగా నియమించారు. తొలిరోజు శిక్షణ కార్యక్రమాన్ని డీఈవో వెంకటేశ్వరచారి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. శిక్షణ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ విధిగా పాల్గొనాలని, ఎవరికి ఎటువంటి మినహాయింపులు, సెలవులు ఉండవన్నారు. శిక్షణకు హాజరయ్యే ఉపాధ్యాయులు తమ వెంట ఒకటి నుంచి ఐదు తరగతుల పాఠ్యపుస్తకాలు, వర్క్, హ్యాండ్‌బుక్స్ తప్పనిసరిగా తెచ్చుకోవాలన్నారు.





మాట్లాడుతున్న డీఈవో వెంకటేశ్వరచారి



శిక్షణకు హాజరైన ఎస్జీటీ ఉపాధ్యాయులు

# ఆటా లేదు.. పాటా లేదు..

(5వ పేజీ తరువాయి)

మీటింగ్ ఉండడంతో టీచర్లంతా మీటింగ్‌కు వెళ్లగా ఆయాలు మాత్రం విధుల్లో ఉన్నారు. లెనిన్‌నగర్-1లో కూడా పిల్లలు తక్కువగా ఉన్నారని, ఆ సెంటర్‌ను ఇక్కడ కలిపారు. ఇక్కడ రెండుసెంటర్లు కలిపి 20మంది విద్యార్థులుండాల్సి ఉండగా 9మంది ఉన్నారు. రాని పిల్లలను ఆయాలు వెళ్లి తీసుకురావడంలేదు. బల్లేపల్లి ఎస్సీకాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో 9మందికి 5 గురు పిల్లలున్నారు. 8మంది గర్భిణీల కోసం 2 మాత్రమే హాజరయ్యారు. మిగతావారు తిని వెళ్లారని ఆయా తెలిపారు.

**ఆటపాటల కరువు**

అంగన్‌వాడీ కేంద్రాల్లో కొన్ని నిబంధనలు ప్రకారం పనిచేస్తున్నా చాలా చోట్ల టీచర్లు, ఆయాలు నిబంధనలకు అనుగుణంగా పనిచేయడంలేదు. పిల్లలకు పరిశుభ్రతగురించి తెలపడం, వారికి ఆహారం అందించడంతో పాటు వారికి ఆటపాటలు నేర్పాలి. ప్రాథమిక విద్యకింద తెలుగు, ఇంగ్లీష్ అక్షరాలు,మాటలు పరిచయం చేయాలి. కానీ ఇవేమి చెప్పడం లేదు కేవలం వచ్చిన పిల్లలకు పౌష్టికాహారం అందిండచం పిల్లలను పంపించడం ఒక విధంగా నడుస్తుంది. ఉదయం 9గంటలకు ప్రారంభమైనా పిల్లలును కూడా తల్లిదండ్రులు సమయపాలనలకుఅనుగుణంగా పంపడంలేదు. కేవలం కోడిగుడ్లు, భోజనాలు పెట్టే సమయంలో పంపడం,తిన్న తర్వాత తీసుకెళ్లడం చేస్తున్నారు. దీంతో అంగన్‌వాడీ కేంద్రాల నిర్వాహణ లక్ష్యం పక్కదారి పడుతోంది. కొన్నిచోట్ల టీచర్ల, ఆయాల మధ్య విబేధాలు నడుస్తున్నాయి. కొందరు రాజకీయపార్టీల అనుబంధ సంఘాల్లో భాగస్వామ్యం ఉండడంతో అంతర్గత విబేధాల కారణంగా టీచర్లకు, ఆయాలకు సమన్వయం లోపిస్తోంది. అంగన్‌వాడీ కేంద్రానికి ఆయాలు వెళ్లి పిల్లలను తీసుకురావాలి. కానీ ఈ ప్రక్రియ జరగడంలేదు. టీచర్లు కూడా చిన్నపిల్లల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి పిల్లలను రప్పించే విధంగా శ్రద్ధ వహించకపోవడంతో అంగన్‌వాడీ వ్యవస్థ మొక్కుబడిగా సాగుతోంది.

**మార్పులు అవసరం**

పట్టణాల్లోని కాలనీల్లో గ్రామాల్లో 20 ఏళ్ల క్రితం నుంచి నడుస్తున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో మొదట్లో పిల్లలు వచ్చినట్టుగా ఇప్పుడు రావడంలేదు ఆర్థిక స్థితిగతులు మారడం,జీవనశైలిలో మార్పులు రావడంతో పట్టణాల్లో ప్లేస్కూల్స్‌కు డబ్బులు కట్టి పంపిస్తున్నారు అంగన్‌వాడీ కేంద్రాలకు కొందరు నామోషీగా భావించి పిల్లలను పంపించడం లేదు. అంగన్‌వాడీ కేంద్రాలను ప్లేస్కూల్‌స్థాయిలో ఆధునీకరించి మౌళిక సదుపాయాలతో పాటు పిల్లలను ఆకర్షించేలా ఆటవస్తువులుతో పాటు ఎల్‌కేజీ, యూకేజీస్థాయిలో ఇంగ్లీష్‌మీడియంలో బోధన కలిపిస్తే అంగన్‌వాడీ కేద్రాలలో పిల్లలు పెరిగే అవకాశం ఉంది. ఎన్నో ఏళ్ల క్రితం పెట్టిన అంగన్‌వాడీ కేంద్రాలను మారుతున్న పరిస్థితులుకు అనుగుణంగా మార్పుచేయాలి.

**మార్పులకు చర్యలు తీసుకుంటాం: రాంగోపాల్‌రెడ్డి, జిల్లా మహిళ శిశుసంక్షేమ అధికారి**

జిల్లాతోపాటు ఖమ్మంఅర్బన్‌లో అంగన్‌వాడీ కేంద్రాలను పటిష్టంచేసేందుకు చర్యలు తీసుకుంటాం.ఇకపై ఆకస్మిక తనిఖీలు చేపడతాం మార్పుతున్న పరిస్థితులకు అనుగుణంగా మార్పులు చేసి ఎక్కువమంది పిల్లలను రప్పించేలా దృష్టిపెడతాం. గ్రామాల్లో పిల్లల సంఖ్య గణనీయంగా ఉన్నా ఖమ్మంఅర్బన్, మునిసిపల్‌పట్టణాల్లో అభివృద్ధి చెదంఇన కాలనీల్లో పిల్లలు తక్కువగా వస్తున్నారు. తక్కువగా హాజరవుతున్న సెంటర్లను కొత్తగా అభివృద్ధి చెందే కాలనీలవైపు బదిలీ చేసి అక్కడ సెంటర్‌లో పిల్లల సంఖ్య పెంచుతున్నాం.

# సీతారామ టన్నెల్‌పై నజర్

- ఎస్ఎల్‌బీసీ ప్రమాదం నేపథ్యంలో పరిశీలించిన అధికారులు

కూసుమంచి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): సీతారామ టన్నెల్‌ను సీడీవో (ఛీఫ్ డిజైన్ ఆర్గనైజేషన్) అధికారుల బృందం పరిశీలించింది. ఇటీవల ఎస్ఎల్‌బీసీ (శ్రీశైలం ఎడమ గట్టు కాల్వ) టన్నెల్‌లో ఎనిమిది మంది కార్మికులు తప్పిపోయిన సంగతి తెలిసిందే. ఈక్రమంలో సీతారామ ప్రాజెక్టు టన్నెల్ వద్ద తీసుకుంటున్న రక్షణ చర్యలు సీడీవో బృందం పరిశీలించింది. గోదావరి జలాలను పాలేరు నియోజకవర్గానికి తరలించే ప్రయత్నంలో చేపట్టిన పనులు వేగంగా జరుగుతున్నాయి. పాలేరు జలాశయానికి గోదావరి జలాలను తరలించేందుకు సుమారు 8కిలోమీటర్లు సొరంగ మార్గాన్ని నిర్మిస్తున్నారు.

తిరుమలాయపాలెం దమ్మాయిగూడెం వద్ద, బీరోలు వద్ద, కూసుమంచి మండలం పోచారం వద్ద సొరంగ మార్గాలు నిర్మిస్తున్నారు. ఇప్పటికి మూడు కిలోమీటర్ల మేర పనులు పూర్తయ్యాయి. టన్నెల్ ప్రాంతాల్లో సుమారు 300మందికి పైగా కార్మికులు పనిచేస్తున్నారు. ఎస్ఎల్‌బీసీలో జరిగిన ప్రమాదం నేపథ్యంలో, సీతారామ ప్రాజెక్టు టన్నెల్ నిర్మాణంలో కార్మికుల రక్షణకు సంబంధించి అధికారులు తీసుకుంటున్న చర్యలను ఆయా ప్రాంతాల్లో పరిశీలించారు. ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఈసందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. బృందంలో సీడీవో ఈఈ చంద్రశేఖర్, ఏఈ దినేష్, సీతారామ ఏఈలు వెంటకేశ్వర్లు, రమాదేవి తదితరులు ఉన్నారు.

# పెద్దసారు కక్కుర్తి

కొత్తగూడెం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): సాధారణంగా ఏసీబీ వలలో అధికారులు, వివిధ శాఖల ఉద్యోగులు చిక్కుకుంటారు. కొందరు అక్రమార్కులు పనులు పూర్తి చేసేందుకు ముడుపులు డిమాండ్ చేసి దొరికిపోతుంటారు. కానీ పాఠాలు చెప్పే ఉపాధ్యాయులకు ఆ ఛాన్సు తక్కువ. అయినా ఓ ప్రధానోపాధ్యాయుడు కక్కుర్తి పడి ముడుపులు డిమాండ్ చేసి ఏసీబీకి అడ్డంగా దొరికిపోయాడు. ఈ సంఘటన కొత్తగూడెంలో శుక్రవారం చోటుచేసుకుంది. కొత్తగూడెం పట్టణంలోని కూలీలైన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవీందర్ రూ.20వేల లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు.

పాఠశాలలో విద్యార్థులకు కరాటే క్రీడలో శిక్షణ ఇచ్చేందుకు పాఠశాలకు ప్రభుత్వం రూ.30వేలు మంజూరుచేసింది. కరాటే శిక్షణ ఇచ్చిన ఇన్‌స్ట్రక్టర్‌కు ఇవ్వాల్సిన ఆ రూ.30వేలలో రూ.20వేలు లంచంగా ఇవ్వాలని హెచ్‌ఎం రవీందర్ ఇన్‌స్ట్రక్టర్‌ను డిమాండ్ చేశాడు. దీంతో సదరు ఇన్‌స్ట్రక్టర్ ఏసీబీ డీఎస్పీ రమేష్‌ను ఆశ్రయించాడు. పూర్తి విచారణ జరిపిన ఏసీబీ అధికారులు... హెచ్‌ఎంను పట్టుకునేందుకు వ్యూహం పన్నారు. వారి సూచన మేరకు కరాటే ఇన్‌స్ట్రక్టర్ శుక్రవారం పాఠశాలకు వెళ్లి హెచ్‌ఎంను కలవగా, డబ్బులు తెచ్చావా.. అని ప్రశ్నించాడు. దీంతో రూ.20వేల నగదు ఇస్తుండగా అక్కడే మాటు వేసిన ఏసీబీ అధికారులు హెచ్‌ఎంను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కేసు నమోదు చేసి విచారణ చేసి హెచ్‌ఎంను అరెస్టు చేశారు. జిల్లాలో డీఎస్పీ రమేష్ ఈ నెలలో మూడుసార్లు దాడులు నిర్వహించి సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేశారు. ఈ ఏడాదిలో ఐదు కేసులు ఏసీబీ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. విద్యార్థులు సన్మార్గంలోనడిచేలా విద్యాబుద్ధులు చెప్పే హెచ్‌ఎం.. తానే దారి తప్పి అవినీతికి పాల్పడి ఏసీబీకి చిక్కడం చర్చనీయాంశంగా మారింది. ఏకంగా పాఠశాలలోనే ముడుపులు తీసుకోవడానికి తెగించడం నివ్వెరపరించింది.

# లింగనిర్ధారణ ముఠా గుట్టు రట్టు

(5వ పేజీ తరువాయి)

కాత్యాయనీ కలిసి పీసీ అండ్ పీఎన్‌డీటీ చట్టం-1994ను ఉల్లంఘించి కొంత కాలంగా లింగ నిర్ధారణ పరీక్షలు చేపడుతున్నారు. కారులో అల్ట్రా స్కానింగ్ మిషన్ ఏర్పాటు చేసుకొని జిల్లాలోని పలు ప్రాంతాలకు వెళ్తున్నారు. ముందస్తుగా వచ్చిన సమాచారం మేరకు నేరుగా గర్భిణుల ఇళ్లకు వెళ్లి లింగ నిర్ధారణ పరీక్షలు చేసి గర్భంలో ఉన్నది ఎవరో ముందే చెబుతున్నారు. తద్వారా అబార్షన్లకు పరోక్షంగా సహకరిస్తున్నారు. వీరు చట్టాన్ని ఉల్లంఘించినందుకు గాను సెక్షన్ 3(ఎ), 6, 18(ఎ), 23, 29 పీసీ అండ్ పీఎన్‌డీటీ చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగుల్ మీరా తెలిపారు. ముగ్గురిలో చారి పరారీలో ఉండగా, రాచబంటి మనోజ్, కాత్యాయనీలను అరెస్టు చేసి స్టేషన్ బెయిల్ ఇచ్చినట్లు తెలిపారు.

# ఆశలకు రెక్కలొచ్చేనా!?

(5వ పేజీ తరువాయి)

రామ్మోహన్‌నాయుడు ఆరుగురు సభ్యుల సర్వే బృందాన్ని కొత్తగూడెం స్థల పరిశీలనకు పంపారు. ఆ బృందం సభ్యులు వచ్చి స్థలాన్ని పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. వారికి కలెక్టర్ ఆధ్వర్యంలో సుజాతనగర్, రామవరం, గరీబ్‌పేట ప్రాంతంలో ఉన్న వెయ్యి ఎకరాల ప్రభుత్వ భూమిపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరాలను అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం సర్వే బృందానికి ఖర్చుల నిమిత్తం రూ.38లక్షల నిధులను విడుదల చేసింది. సర్వే బృందం ఎయిర్‌పోర్టు నిర్మాణానికి స్థలం అనుకూలంగా ఉందని కూడా సంతృప్తి వ్యక్తం చేసింది. సాంకేతిక నిపుణుల బృందాన్ని పంపిస్తామని, కేంద్ర ప్రభుత్వానికి సర్వే వివరాలను నివేదిక ద్వారా అందజేస్తామని కూడా జిల్లా యంత్రాంగానికి తెలియచేశారు. అయితే ఇప్పటివరకు సాంకేతిక బృందం జిల్లాకు రాలేదు.

**సన్నద్ధంగా రాష్ట్ర ప్రభుత్వం**

ఇటీవల మంత్రి తుమ్మల కొత్తగూడెంలో ఎయిర్‌పోర్టు ఏర్పాటు చేయిస్తామని, దీనికి రాష్ట్ర ప్రభుత్వం కూడా పూర్తిస్థాయిలో సహకరిస్తుందని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా అనుకూలంగా ఉన్నారని, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడిని కలిసి కొత్తగూడెం ఎయిర్‌పోర్టుపై విజ్ఞప్తి చేశారు. ఇప్పటికైనా జిల్లాకు సంబంధించిన ముగ్గురు మంత్రులు, ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజాప్రతినిధులు, రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోపాటు రాష్ట్రానికి చెందిన ఇద్దరు కేంద్ర మంత్రులు సైతం పూర్తిస్థాయిలో సహకరిస్తే తప్పనిసరిగా కొత్తగూడెంలో ఎయిర్‌పోర్టుకు అడుగులు పడే అవకాశాలు ఉన్నాయి.

# ప్రాణాలు తీసిన ఇసుక దందా

(5వ పేజీ తరువాయి)

ఆలస్యంగా ఎంజీఎం తీసుకువెళ్లడం వల్లే పరిస్థితి విషమించి మృతి చెందాడని స్థానికులు చెబుతున్నారు.

కాగా, ఘటన జరిగిన ప్రాంతానికి చర్ల ఎస్ఐలు నర్సిరెడ్డి, కేశవ చేరుకుని విచారించారు. ట్రాక్టర్‌లను చర్ల స్టేషన్‌కు తరలించారు. విచారణ జరుపుతున్నామని, ప్రస్తుతానికి ట్రాక్టర్ డ్రైవర్ తన్నీరు రవిపై కేసు నమోదైందని, ఇతరులపై కూడా కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ నర్సిరెడ్డి తెలిపారు. కాగా కూలి పనులకు వచ్చి ఇద్దరు చనిపోవడంతో వారితో ఉన్న ఆదివాసీలు కన్నీరుమున్నీరయ్యారు.

చేతిలో డబ్బులు లేక ఎటు వెళ్లాలో తెలియక విలపించారు. ఇదిలావుండగా, రెవెన్యూ అధికారులు పట్టించుకోక పోవడంతోనే చర్ల మండలంలో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.


# వైరాకు నిలిచిపోయిన సాగర్‌జలాలు

- 12.9అడుగులకు పడిపోయిన నీటిమట్టం

వైరా, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): వైరా రిజర్వాయర్‌కు సాగర్ జలాల నీటి సరఫరాను నిలిపివేశారు. దాంతో రిజర్వాయర్ నీటిమట్టం శుక్రవారం నాటికి 12.9 అడుగులకు పడిపోయింది. ఎండల తీవ్రత పెరిగిన ప్రస్తుత తరుణంలో సాగర్‌జలాల సరఫరా నిలిచిపోవడంతో ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 18.3అడుగులు కాగా ప్రస్తుతం 12.9అడుగులుగా ఉంది. 5.3 అడుగుల నీటిమట్టం తగ్గడంతో రబీలో పంటల సాగుతోపాటు మిషన్ భగీరథ పథకం నుంచి తాగునీటి సరఫరాపై కూడా దీని ప్రభావం పడనుంది. ఈ పరిస్థితుల్లో నిరంతరాయంగా సాగర్‌జలాలను వైరాకు సరఫరా చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. గత నెలలో నాలుగైదు రోజులపాటు వైరాకు సాగర్‌జలాలు సరఫరా చేసిన అధికారులు ఆతర్వాత నిలిపివేశారు. సాగర్ ఆయకట్టులో పంటలకు నీటిని అందిస్తున్న అధికారులు వైరాకు ఆనీటి సరఫరాను బంద్ చేశారు. అయితే వైరాకు కూడా సాగర్‌జలాలు సరఫరా చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఈ ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

**రబీ సాగు కోసం...**

ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ఏప్రిల్ 23వరకు రబీ సాగుకు షెడ్యూల్ ప్రకటించింది. వారబందీ విధానంలో ఫిబ్రవరి 11నుంచి ఆయకట్టులోని పంటలకు నీరు సరఫరా చేస్తున్నారు. ఇకపోతే కుడి. ఎడమకాల్వల కింద రబీలో దాదాపు 10నుంచి 15వేల ఎకరాల్లో వరి, మొక్కజొన్న ఇతర పంటలను సాగుచేశారు. వైరా ఆయకట్టులోనేకాకుండా ఏర్లు, వాగులు, కరెంట్ మోటర్ల ఆధారంగా ఇప్పటికే దాచాపురం, గరికపాడు, ఖానాపురం, ముసలిమడుగు, గొల్లెనపాడు తదితర గ్రామాల్లో వందలాది ఎకరాల్లో వరి వేశారు.



12.9అడుగులతో ఉన్న వైరా రిజర్వాయర్ నీటిమట్టం

**నీటిమట్టం తగ్గడంతో ఆందోళన...**

ఈ పరిస్థితుల్లో రిజర్వాయర్ నీటిమట్టం 12.9అడుగులకు తగ్గిపోవడంతో ఆయకట్టు రైతులు ఆందోళనగా ఉన్నారు. ఖరీఫ్‌లో సాగర్‌జలాలతో నిమిత్తం లేకుండానే వర్షాధారంగానే రిజర్వాయర్ నుంచి కుడి, ఎడమకాల్వల ద్వారా పంటలకు నీటి సరఫరా చేశారు. అయితే ఇప్పుడు నీటిమట్టం తగ్గిపోతున్నందున సాగర్‌జలాల అవసరం ఏర్పడింది. ఎన్నెస్పీ 21ఎంబీసీ పైనున్న ఎస్కేప్‌లాకుల నుంచి వైరా రిజర్వాయర్‌కు సాగర్‌నీరు సరఫరా చేయాలని రైతులు కోరుతున్నారు. అనేకమంది రైతులు ఈ రబీలో దమ్ములు చేసి నేరుగా వరి విత్తనాలు చల్లుకున్నారు. కొంతమంది రైతులు నాట్లు వేశారు.

అందువలన సాగర్‌జలాలతో వైరా రిజర్వాయర్‌ను పూర్తిస్థాయిలో నింపి రబీలో రైతులకు భరోసా కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. అంతేకాకుండా రిజర్వాయర్‌లో కనిష్టంగా 14అడుగుల నీటిమట్టాన్ని మిషన్ భగీరథ తాగునీటి అవసరాల కోసం నిల్వ ఉంచాలనే నిబంధన కూడా ఉంది. సాగు, తాగునీటి అవసరాల దృష్ట్యా ఎలాంటి నిమాంనలేకుండా సాగర్‌జలాలతో రిజర్వాయర్‌ను నింపాలని రైతులుకోరుతున్నారు.

## క్రైం సమాచారం

### నకిలీ నోట్ల కేసు కొట్టివేత

భద్రాచలం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం పోలీసు స్టేషన్‌లో 2013లో నమోదైన నకిలీ నోట్ల కేసును కొట్టివేస్తూ శుక్రవారం భద్రాచలం ప్రథమశ్రేణి న్యాయాధికారి శివనాయక్ తీర్పు వెల్లడించారు. కేసు నెం.221/2013 కింద ములకలపల్లి అశోక్, కొండసాని రాము, కత్తుల వెంకటేశ్వర్లపై నకిలీ నోట్లు ఇప్పిస్తామని నమ్మబలికి అసలు నోట్లను రూ.3 వేలు తీసుకున్నారని అభియోగంతో కేసు నమోదైంది. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి ముద్దాయిలపై నేరం రుజువు కాలేదని, నిర్దోషులుగా ప్రకటిస్తూ తీర్పు వెల్లడించారు.

### ఎండు గంజాయి పట్టివేత

పాల్వంచ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ద్విచక్రవాహనంపై తరలిస్తున్న గంజాయిని పాల్వంచ టౌన్ పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. హైదరాబాద్‌కు చెందిన పత్తిపూడి అభిరామ్, మేకపాటి చంద్రశేఖర్ ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో ఓ దళారి నుంచి ఎండు గంజాయిని కొనుగోలు చేశారు. దానిని హైదరాబాద్ తరలించి సొమ్ము చేసుకోవాలనుకున్నారు. పోలీసుల కళ్లుగప్పి భద్రాచలం మీదుగా హైదరాబాద్‌కు ద్విచక్రవాహనంపై బయలుదేరారు. అదే సమయంలో పాల్వంచ సంజయ్‌నగర్ ప్రాంతంలో టౌన్ అడిషనల్ ఎస్‌ఐ రాఘవయ్య తన సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు చేపట్టారు. వాహన తనిఖీల్లో భాగంగా వారిని ఆపి తనిఖీ చేయగా వారివద్ద ఉన్న బ్యాగులో ఎనిమిది కిలోల ఎండు గంజాయి లభించింది. దీంతో వారిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి ఎండు గంజాయితో పాటు రెండు సెల్‌ఫోన్లు, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరచనున్నట్లు పాల్వంచ సీఐ సతీష్ తెలిపారు. పట్టుబడిన గంజాయి విలువ బహిరంగ మార్కెట్‌లో రూ. 80 వేలు ఉంటుందని అంచనా.

### జడ్పీటీసీ మాజీ సభ్యుడు గాదె సత్యం మృతి



సత్తుపల్లి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి జడ్పీటీసీ మాజీ సభ్యుడు, సీనియర్ రాజకీయవేత్త గాదె సత్యనారాయణ(76) శుక్రవారం హైదరాబాద్ ఆసుపత్రిలో మృతిచెందారు. ఆయన కొంతకాలంగా ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధితో బాధపడుతున్నారు. రెండు రోజుల క్రితం ఆరోగ్యం క్షీణించడంతో సత్తుపల్లి నుంచి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందారు. గాదె సత్యనారాయణ తన రాజకీయ ప్రస్థానాన్ని కమ్యూనిస్ట్ పార్టీలో ప్రారంభించి తెలుగుదేశం పార్టీ ఆవిర్భావంతో ఆ పార్టీలో చేరారు. సత్తుపల్లి కో-ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడిగా రెండు దశాబ్దాలు పనిచేసిన గాదె సత్యనారాయణ సత్తుపల్లి జడ్పీటీసీగా సేవలందించారు. మూడున్నర దశాబ్దాలు తెలుగుదేశం పార్టీలో కొనసాగిన గాదె సత్యనారాయణ తుమ్మల ప్రధాన అనుచరుడిగా బీఆర్ఎస్‌లోనూ, ఆ తర్వాత కాంగ్రెస్‌లో చేరారు. కొన్నేళ్లపాటు సత్యసాయి సేవా సమితిలో క్రియాశీలకంగా పనిచేస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కొవిడ్ బారిన పడిన గాదె సత్యనారాయణ తీవ్ర అనారోగ్యానికి గురై కోలుకున్నారు. ఇటీవల ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధితో చికిత్స పొందుతూ మృతిచెందారు. శనివారం మధ్యాహ్నం 3గంటలకు అంత్యక్రియలు జరుగుతాయని బంధువులు తెలిపారు.

**మంత్రి తుమ్మల సంతాపం**

గాదె సత్యనారాయణ మృతిపట్ల వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు సంతాపం ప్రకటించారు. కమ్మ సంఘం సత్తుపల్లి నియోజకవర్గం కన్వీనర్ చలసాని సాంబశివరావు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు యాగంటి శ్రీనివాసరావు సంతాపం వ్యక్తం చేశారు.

### గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం


ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ఈనెల 26వ తేదీన ఏదులాపురం మునిసిపాలిటీ పరిధిలోని పల్లెగూడెం వద్ద ఎన్నెస్పీ కాలువలో గల్లంతైన వ్యక్తి మృతదేహం శుక్రవారం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నాయుడుపేట ఇందిరమ్మ కాలనీకి చెందిన గోలి అశోక్ మహాశివరాత్రి సందర్భంగా స్నేహితులతో కలిసి పార్టీ చేసుకున్నాడు. సాయంత్రం అశోక్ అతడి స్నేహితుడు గురుస్వామి ఇద్దరు కలిసి పల్లెగూడెం వద్ద ఎన్నెస్పీ కాలువలో స్నానానికి వెళ్లారు. ప్రమాదవశాత్తు అశోక్ కాలు జారీ కాలువలో పడి గల్లంతయ్యాడు. ఆరోజు ఎంత వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. అర్బన్ మండలం, వి.వెంకటాయపాలెం సమీపంలోని ఎన్నెస్పీ కాలువలో అశోక్ మృతదేహం లభ్యం అయింది. పోలీసులు అన్నం శ్రీనివాస్ సహాయంతో మృతదేహన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వఆసుపత్రికి తరలించారు.

### నమ్మించి మోసం చేసిన వ్యక్తిపై కేసు

తిరుమలాయపాలెం, ఫిబ్రవరి28(ఆంధ్రజ్యోతి): తిరుమలాయపాలెం గ్రామానికి చెందిన కొమ్ము శ్రావణి అనే యువతిని వివాహం చేసుకుంటానని మోసం చేసిన వ్యక్తిపై శుక్రవారం పోలీసుస్టేషన్‌లో కేసు నమోదయింది. తిరుమలాయపాలేనికి చెందిన శ్రావణి ఖమ్మంరూరల్ మండలం ఆరేకోడుకు చెందిన చిర్రా మహేష్ శ్రావణిని రెండేళ్లుగా వివాహం చేసుకుంటానని మాయమాటలు చెప్పాడు.

ఓ పాప పుట్టిన తర్వా త నీకునాకు ఎటువంటి సంబంధం లేదని ఆపాప నాకు పుట్టలేదని బుకాయించాడు. ఈవిషయమై సదరు యువతి మహేష్ ఇంటికి వెళ్లగా అతడి తల్లిదండ్రులు, చెల్లెలు కూడా ఇంటికి రావద్దంటూ ఇంటికి వస్తే చంపుతామని బెదిరింపులకు పాల్పడ్డారు. దీంతో సదరు యువతి తనను మోసం చేసిన మహేష్, తల్లిదండ్రులు ఉప్పలయ్య, మరియమ్మ, చెల్లెలు ఆరెంపుల మహేశ్వరిపై ఫిర్యాదుచేయగా విచారణ చేసి వారిపైకేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ కూసుపుడి జగదీష్ తెలిపారు.

### కల్లంలో ఐదు క్వింటాళ్ల మిర్చి మాయం



చోరీ జరిగిందని చెబుతున్న బాధిత రైతు

కూసుమంచి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): కూసుమంచి మండలకేంద్రానికి చెందిన ఆడెపు కృష్ణ అనేరైతు నాలుగు ఎకరాలు భూమిని కౌలుకు తీసుకుని మిర్చిసాగుచేశాడు. ఈక్రమంలో గత వారం రోజులుగా మహారాష్ట్ర కూలీల సాయంతో కోతపూర్తయిన వెంటనే కల్లంలో ఆరబోశాడు. రాత్రి సమయంలో పంటను చూసుకొని ఇంటికి వెళ్లి తెల్లవారుజామున వచ్చి చూసుకున్నాడు. మిర్చికుప్ప తక్కువగా ఉండటం దారిలో మిర్చికాయలు పడిఉండటంతో చోరీ జరిగిందని గుర్తించి కన్నీటి పర్యంతమయ్యాడు. వెంటనే పోలీసులకు ఫిర్యాదుచేయడంతో ఘటనాస్థలానికి వచ్చి పరిశీలించారు. చోరీకి గురయిన పంట సుమారు ఐదు క్వింటాళ్ల పైగా ఉంటుందని రూ.లక్ష వరకు ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశాడు. ఈవిషయమై కూసుమంచి ఎస్‌ఐ నాగరాజును వివరణ కోరగా రైతు ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి విచారణ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

### లైంగిక వేధింపుల సంఘటనపై సీడబ్ల్యూసీ విచారణ

ఖమ్మం ఖానాపురంహవేలి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఓ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఓ బాలికను అదే కళాశాల కాంట్రాక్ట్ అధ్యాపకుడు లైంగిక వేధింపులకు గురిచేస్తున్న విషయాన్ని ఆంధ్రజ్యోతి బుధవారం ప్రముఖంగా ప్రచురించింది. దీంతో శుక్రవారం చైల్డ్ వేల్ఫేర్ కమిటీ ఛైర్‌పర్సన్ భారతీరాణి ఆధ్వర్యంలో కళాశాలలో, విద్యార్థిని బస చేసిన హాస్టల్లో విచారించినట్లు తెలిసింది. కళాశాలలోని అధ్యాపకులను, హాస్టల్ వార్డెన్‌తో మాట్లాడి నివేదికను తయారు చేసినట్లు తెలిసింది. కాగా గురువారం జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవిబాబు కళాశాలలో విచారణ జరిపారని తెలిసింది. అయితే 33 మంది అధ్యాపకులు ఉన్న కళాశాలలో కేవలం నలుగురినే విచారించి నివేదిక ఎలా తయారు చేశారో ఆ అధికారికే తెలియాలి. ఈ విషయమై శుక్రవారం పలు విద్యార్థి సంఘాల నాయకులు కళాశాల ముందు ధర్నా నిర్వహించి అధ్యాపకుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్లు

# ఇష్..క రవాణా

- చర్లలో జోరుగా ఇసుక అక్రమ దందా
- రాత్రి, పగలు లేకుండా తోలకాలు
- పట్టించుకోని రెవెన్యూ అధికారులు

చర్ల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): చర్ల మండలంలో ప్రతీ రోజు ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. కొంత మంది వ్యక్తులు అధికారులను మచ్చిక చేసుకుని తేగడ, తాలిపేరు ప్రాజెక్టు, కొత్తపల్లి, పెద్దిపల్లి, వీరాపురం ఇసుక క్వారీల నుంచి దందాను సాగిస్తున్నారు. అడిగేవారు లేక పోవడంతో ఆడిందే ఆట పాడిందే పాటగా సాగుతోంది. ప్రతీ రోజు పదుల సంఖ్యలో ట్రాక్టర్లు అక్రమ రవాణా చేస్తున్నా చర్ల రెవెన్యూ అధికారులకు అవి ఏమాత్రం కనిపించడం లేదు. ఒక వైపు జిల్లా కలెక్టర్ ఇసుక అక్రమ రవాణాను కట్టడి చెయ్యాలని ఆదేశాలు జారీ చేస్తున్నా అవి క్షేత్ర స్థాయిలో అమలు కావడం లేదు. చర్ల పోలీసులు కొద్ది రోజుల క్రితం దాడులు చేసి ట్రాక్టర్లపై కేసులు నమోదు చేశారు. అయినా ఇసుక దందా జోరుగా సాగుతోంది.

**మూడు పువ్వులు ఆరు కాయలు**

చర్ల మండలంలోని రెవిన్యూ అధికారులు ఉదాసీనంగా వ్యవహరించడంతో గత కొంత కాలంగా ఇసుక వ్యాపారులు దందాను సాగిస్తున్నారు. అధికారులు కూడా వత్తాసు పలుకుతుండడంతో రాత్రి, పగలు లేకుండా తోలకాలు జరుపుతున్నారన్న విమర్శలు ఉన్నాయి. స్థానికులు ఎవరైనా ట్రాక్టర్లు నిలుపుదల చేస్తే వారిని బెదిరింపులకు గురిచేస్తున్నారన్న ఆరోపనలు వస్తున్నాయి. చర్ల, తేగడ, కుదునూరు, మిడిసిలేరు, ఉప్పరిగూడెం, గుంపెన గూడెం, రాళ్లగూడెం, ఆర్‌కొత్తగూడెం, దుమ్ముగూడెం మండలాలకు చెందిన వ్యక్తులు ఇలా దందాను సాగిస్తున్నారు. ఒక్కో ట్రాక్టర్ ఇసుకను సుమారు రూ. రెండు వేల నుంచి రూ. 2500 అమ్ముతున్నారు. గతంలో తహసీల్దార్‌గా పనిచేసిన నాగేశ్వరావు ఇసుక పై ఉక్కుపాదం మోపారు. ఏడాదిలో సుమారు 50పైగా ట్రాక్టర్లు పట్టుకుని రూ. నాలుగు లక్షలకు పైగా జరిమానా వేశారు. ఆయన బదిలీ తరువాత మళ్లీ ఇసుక వ్యాపారం సాగుతోంది. ఈఏడాదిలో ఇప్పటివరకు కేవలం ఐదు ట్రాక్టర్లను కూడా రెవెన్యూ అధికారులు పట్టుకున్న దాఖాలు లేవు. ఇదే విషయం చర్ల తహసీల్దార్ శ్రీనివాస్‌ను వివరణ కోరగా ఇసుక రవాణా చేస్తే సీజ్ చేస్తామంటూ ముక్తసరిగా సమాధానం ఇచ్చారు.

**పోలీసులు దృష్టి పెడుతారా?**

చర్ల పోలీసులు కొద్ది రోజుల క్రితం ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపారు. ఇసుక తోలితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దాడులు చేసి నాలుగు ట్రాక్టర్లు పట్టుకుని కేసులు నమోదు చేశారు. దీంతో ఇసుక అక్రమ రవాణా రెండు రోజులు నిలిచి పోయింది. పోలీసులు మళ్లీ పెద్దగా దృష్టి సారించకపోవడంతో రాత్రి, పగలు లేకుండా దందా సాగిస్తున్నారు. పోలీసులు రాత్రి వేళల్లో దాడులు చెయ్యరని అందుకే రాత్రి వేళల్లో అక్రమ రవాణాకు పాల్పడుతున్నారని పలువురు ట్రాక్టర్ యజమానులు బాహటంగానే చెబుతున్నారు.

**కలెక్టర్ దృష్టి పెడుతారా?**

చర్ల మండలంలో ఇసుక రవాణాపై జిల్లా కలెక్టర్ దృష్టి పెట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. మండలంలో ఇసుక క్వారీలు ఉన్నా స్థానికులకు మాత్రం అందని ద్రాక్షగా మారింది. మండల వాసులు ప్రభుత్వ ఇసుక క్వారీల నుంచి ఇసుక తోలుకునే అవకాశం కలిపించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఇలా చేస్తే ప్రభుత్వానికి ఆదాయంతో పాటు ఇసుక అక్రమ రవాణాకు చెక్ పడనుంది.



సింగరేణి రెస్క్యూ టీంతో సింగరేణి చైర్మన్ బలరాం

### ఆపద్బాంధవులు సింగరేణి రెస్క్యూ టీం

- ఎస్ఎల్‌బీసీ టెన్నల్‌లోను మెరుగైన సేవలు

రుద్రంపూర్, (సింగరేణి) ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన సంఘటనలలో ఆపద్బాంధవులుగా సింగరేణి రెస్క్యూ టీం కీలక బాధ్యత పోషిస్తోంది. ఇటీవల శ్రీశైలం ఎడమ కాల్వ గట్టు ఎస్ఎల్‌బీసీ స్వరంగ టెన్నల్ వద్ద జరిగిన ప్రమాదంలో పలువురు ఇంజనీర్లు చిక్కుకున్న ప్రాంతాలకు వెళ్లేందుకు రెస్క్యూ టీం ప్రయత్నాలు ముమ్మరంచేసింది. సింగరేణి చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ బలరాం నేతృత్వంలో సింగరేణి వ్యాప్తంగా వివిధ ఏరియాలకు సంబంధించిన 250 మంది రెస్క్యూ టీం సభ్యులు సంఘటన స్థలానికి చేరుకుని సహాయ చర్యలను ప్రారంభించారు. సింగరేణి సీఎండీ అంకితభావంతో విధులు నిర్వహిస్తున్న రెస్క్యూ టీం సిబ్బందిని అభినందించారు.

### మునగ సాగు రైతులకు లాభదాయకం

- భద్రాద్రి కొత్తగూడెం ఉద్యాన అధికారి కిషోర్

అశ్వారావుపేట, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): మునగతోటకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందని, రైతులకు మంచి లాభదాయకంగా ఉంటుందని జిల్లా ఉద్యాన,పట్టు పరిశ్రమశాఖ అధికారి జంగాల కిషోర్ తెలిపారు. శుక్రవారం సత్తుపల్లి మండలంలోని గంగారం నర్సరీలో పంపిణీకి సిద్ధంగా ఉన్న మునగ మొక్కలను పరిశీలించారు. అనంతరం ఆయన అశ్వారావుపేటలోని కొబ్బరి విత్తనోత్పత్తి క్షేత్రాన్ని పరిశీలించారు. గంగారం నర్సరీలో లక్ష మొక్కలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయన్నారు. ఒక్కో మొక్క రూ.10ల చొప్పున, రవాణా ఖర్చులతో కలసి మొక్కకు రూ.15లు సరఫరా చేస్తామని తెలిపారు. ఎకరానికి 1000 మొక్కలు నాటితే ప్రతి మొక్కకు కనీసం 100 కాయలు వస్తాయని తెలిపారు.

# వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

- కోయగూడెంలో ట్రాక్టర్‌పై నుంచి జారిపడిన డ్రైవర్
- మోతె శివారులో ద్విచక్ర వాహనం, ఆటో ఢీ..
- ఇల్లెందులో అదుపు తప్పిన ద్విచక్రవాహనం



టేకులపల్లి మండలంలో ట్రాక్టర్ పైనుంచి జారిపడి మృతిచెందిన ముక్తేష్



బూర్గంపాడు మండలంలో రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన శ్రీనివాసరావు



ఇల్లెందు మండలంలో జరిగిన యాక్సిడెంట్‌లో మృతిచెందిన భరత్

టేకులపల్లి/ బూర్గంపాడు/ ఇల్లెందు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో శుక్రవారం మూడుచోట్ల వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదల్లో ముగ్గురు వ్యక్తులు మృతిచెందారు.

**ట్రాక్టర్‌పై నుంచి జారిపడి డ్రైవర్ మృతి..**

ట్రాక్టర్‌పై నుంచి జారిపడి ఆ ట్రాక్టర్ డైవర్ మృతి చెందిన ఘటన టేకులపల్లి మండలంలోని కోయగూడెంలో శుక్రవారం రాత్రి జరిగింది. ఈ ప్రమాదంలో మండలంలోని మద్రాసుతండాకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ మూతి ముక్తేష్(38) మృతి చెందాడు. టేకులపల్లి పోలీసుల కథనం ప్రకారం .. మండలంలోని కోయగూడెం గ్రామానికి చెందిన రైతు తుమ్మేటి ఉపేందర్‌కు చెందిన చేలో మిర్చిఏరివేత కూలీలను శుక్రవారం రాత్రి చేను నుంచి మూతి ముక్తేష్ ట్రాక్టర్‌లో తీసుకెళుతున్నాడు. చేనుసమీపంలో ట్రాక్టర్ డైవర్ ముక్తేష్ ట్రాక్టర్ నడుపుతూనే బాటిల్‌లోని మంచినీళ్లను తాగుతూ ఆకస్మాత్తుగా ట్రాక్టర్ నుంచి జారీ కింద పడిపోయాడు. ట్రాక్టర్ టైరు ఆయనపై ఎక్కివెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. డ్రైవర్ కిందజారి పడటంతో కదులుతున్న ట్రాక్టర్‌నుంచి మిర్చి ఏరివేత పనులు నిర్వహిస్తున్న వలస కూలీలు క్రిందకు దూకి ప్రాణాలను కాపాడుకొన్నారు. టేకులపల్లి సీఐ తాటిపాముల సురేష్ సంఘటనాస్థలాన్ని సందర్శించి పరిశీలించారు. కాగ మృతునికి భార్య, ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. టేకులపపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

**ఆటో, ద్విచక్ర వాహనం ఢీ..**

ఆటో, ద్విచక్ర వాహనం ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహనదారుడు మృతి చెందాడు. ఈ ఘటన శుక్రవారం మోతె శివారు అటవీ ప్రాంతంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. అశ్వాపురం గ్రామానికి చెందిన బండ్ల శ్రీనివాసరావు(35) అనే వ్యక్తి బెంగళూరులోని ఓ ప్రైవేటు కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. అతడికి బూర్గంపాడు మండల పరిధిలోని సారపాకకు చెందిన ఉషాశ్రీతో వివాహమైంది. వీరికి నితిష్య(3) అనే పాప, నెల రోజుల క్రితం పుట్టిన కుమారుడు ఉన్నారు. ద్విచక్ర వాహనంపై అశ్వాపురం నుంచి సారపాక వెళ్తుండగా ఇరవెండి-మోతెపట్టీనగర్ గ్రామాల మధ్య ఉన్న అటవీ ప్రాంతంలో ఇరవెండి వైపునకు వెళ్తున్న ఆటో, ద్విచక్ర వాహనం ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడు రోడ్డు పక్కనే ఉన్న చెట్లలో పడిపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. ఆటో డ్రైవర్‌తో పాటు ఆటోలో ఉన్న ఇరువురు ప్రయాణికులకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు భద్రాచలం ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించి ప్రమాదంపై ఆరా తీశారు. మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**స్నేహితుడి పుట్టిన రోజుకు వచ్చి ..**

ఇల్లెందు టౌన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): స్నేహితుడి పుట్టిన రోజు కోసం హైదరాబాద్ నుంచి ఖమ్మం వచ్చి, అక్కడి నుంచి ఇల్లెందుకు వస్తుండగా జరిగిన ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన శుక్రవారం తెల్లావారుఝామున ఇల్లెందు పట్టణంలో చోటుచేసుకుంది. ఇల్లెందు పోలీసుల కథనం ప్రకారం టేకులపల్లి మండలం బేతంపూడి గ్రామానికి చెందిన వీర్ల భరత్(20) గత కొంతకాలంగా హైదరాబాద్‌లో ఉంటూ ఇంజనీరింగ్ చదువుతూ పార్ట్ టైంగా వేరే వర్క్ చేసుకుంటున్నాడు. అయితే ఖమ్మానికి చెందిన తన స్నేహితుడి పుట్టిన రోజు ఉందని ఖమ్మానికి రావాలని కోరడంతో హైదరాబాద్ నుంచి ఖమ్మం వచ్చాడు. ఖమ్మం నుంచి గురువారం అర్ధరాత్రి ఇల్లెందు మీదుగా టేకులపల్లి మండలం బేతంపూడి వచ్చేందుకు ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. పట్టణ సమీపంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదురుగా ద్విచక్రవాహనం అదుపు తప్పి చెట్టుకు ఢీకొనడంతో భరత్ తీవ్రగాయాల పాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ద్విచక్రవాహనాన్ని ఫాలో చేస్తూ ఖమ్మం నుంచి కారులో వచ్చిన తన స్నేహితులు ప్రమాద సంఘటనను చూసి ఇల్లెందు పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు ఇల్లెందు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. స్నేహితుడి పుట్టిన రోజుకు వచ్చిన ప్రమాదంలో మృతి చెందడంలో వారి కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ప్రభుత్వ వైద్యశాల వద్ద కుటుంబసభ్యుల రోధనలతో రోదనలు మిన్నంటాయి.

# పట్టా భూమి శ్మశానానికి కేటాయింపు..

- న్యాయం చేయాలని బాధిత రైతు వేడుకోలు
- అధికారుల పొంతనలేని మాటలతో బెంబేలు



ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతు యాసారపు పాపయ్య దంపతులు

ఆళ్లపల్లి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ఒక తహసీల్దార్ అన్ని సర్వేలు చేసి పట్టా జారీ చేసి ఇస్తే.. మరో తహసీల్దార్ ఆ భూమిని లాక్కోని ఓ సామాజిక వర్గానికి శ్మశానవాటికకు అప్పగించారు. దాంతో పట్టా కలిగిన రైతు దంపతులు తమకు న్యాయం చేయండని రెవెన్యూ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

ఆళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన యాసారపు పాపయ్య తాతల,తండ్రుల కాలం నుంచి మండల కేంద్రలోని 484/ఆ2లో సుమారు ఐదు ఎకరాల్లో వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వారు సాగుచేసుకుంటున్న భూమికి అప్పటి తహసీల్దార్, రెవెన్యూ సిబ్బంది సర్వేలు ఐదు 5 ఎకరాలకు పట్టా జారీ చేశారు. రైతుబంధు డబ్బులు రావడంతో పంటసాగుకు ఉపయోగిస్తూ జీవనం గడుపుతున్నారు. ఈ క్రమంలో ఇటీవలే ఓ సామాజిక వర్గానికి చెందిన వారు శశాన వాటికకు భూమి కావాలని ఆళ్లపల్లి తహసీల్దార్‌కు అర్జీ పెట్టుకోవాడంతో ప్రస్తుత తహసీల్దార్ సమక్షంలో రెవెన్యూ అధికారులు యాసారపు పాపయ్య 484/ఆ2 పట్టాకలిగిన భూమిలో కొంత భూమిని శశానానికి కేటాయించారు. దాంతో బాధితులు తమ పట్టా భూమి లాక్కోవడం సరైంది కాదని వాదించారు. అయినా వినకుండా రెవెన్యూ అధికారులు భూమి లాక్కొన్నారని బాధితులు తెలిపారు.

భూ సమస్యపై గతంలో రెవెన్యూ, పోలీస్, గ్రామస్థుల మధ్య విచారణ జరిగినప్పటికీ సమస్య పరిష్కారం అవ్వకపోవడంతో బాధితులైన రైతు దంపతులు న్యాయం కోసం కలెక్టర్ కార్యాలయాన్ని ఆశ్రయించారు. సంబంధిత అధికారులు ఆళ్లపల్లి తహసీల్దార్‌కు రిఫర్ చేశారు. ఆళ్లపల్లిలో తమకు న్యాయం జరగడం లేదని జిల్లా కలెక్టర్ కార్యాలయాన్న ఆశ్రయిస్తే.. ఆ సమస్య తిరిగి ఆళ్లపల్లికే చేర్చడంతో బాధితులు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు.

సమస్యపై తహసీల్దార్‌ను అడిగితే భయాందోళనకు గురిచేసే, పొంతన లేని సమాదానం ఇస్తున్నారని బాధితులు ఆరోపించారు. దీంతో తన భూమి ఎక్కడ పోతుందోనని మనోవేదనకు గురి అవుతున్నానని రైతు దంపతులు కన్నీరు పెడుతున్నారు. భూమి సర్వే చేసినా, పూర్తి వివరాలు చెప్పలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో వందల ఎకరాల్లో ప్రభుత్వ భూమి ఉన్నపట్టికీ తమ పట్టా భూమిని తహసీల్దార్ మరొకరికి అప్పగించారని వాపోతున్నారు. కాగా పాపయ్య పట్టా భూమిలోని కొంత భూమిని శ్మశానవాటికకు కేటాయించడంపై 'ఆంధ్రజ్యోతి' ఆళ్లపల్లి తహసీల్దార్‌ను వివరన కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

# అపార్ట్‌మెంట్‌లో చోరీ

- 250 గ్రాముల బంగారం, సుమారు రూ.3లక్షల నగదు..



దుండగులు పగులగొట్టిన తలుపు బేడం

ఖమ్మం క్రైం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): తాళం పగలగొట్టి ఇంట్లో బంగారం, నగదు చోరీ చేసిన సంఘటన శుక్రవారం తెల్లవారుజామున ఖమ్మం నగరంలో జరిగింది. నగరంలోని కవిరాజ్ నగర్, మైసమ్మ తల్లి గుడి సమీప ప్రాంతానికి చెందిన చల్లా శ్రీనివాసరావు ఓ అపార్ట్‌మెంట్‌లోని ఊడో అంతస్థులో నివాసం ఉంటున్నారు. ఇటీవల ఓ శుభకార్యం నిమిత్తం హైదరాబాద్‌లోని బంధువుల ఇంటికి వెళ్లారు. శుక్రవారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు అపార్ట్‌మెంట్‌లోకి ప్రవేశించి గడ్డపలుగుతో మూడవ అంతస్థులోని ఇంటి తలుపును పగలగొట్టారు. తరువాత ఇంటిలోనికి ప్రవేశించి ఇంటిలోని లాకర్‌ను దొంగిలించి వెళ్లారు. శుక్రవారం ఉదయం సమయంలో పక్కన ఫ్లాట్‌వారు, వాచ్‌మెన్ తాళం పగలగొట్టి ఉన్నది చూసి శ్రీనివాసరావుకు ఫోన్ చేసి సమాచారం అందించారు. దీంతో ఇంటికి చేరుకున్న శ్రీనివాసరావు ఇంట్లోకి వెళ్లి చూడగా లాకర్ కనిపించలేదు. దీంతో బాధితుడు ఖనాపురం హవేలీ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు సంఘటన స్థలం వద్దకు చేరుకుని క్లూస్ టీం ద్వారా వివరాలు సేకరించారు. కాగా విషయం తెలిసిన నగర ఏసీపీ రమణమూర్తి సంఘటన స్థలం కు చేరుకుని సీసీ కెమారాలను సైతం పరిశీలించారు. దొంగలు తీసుకువెళ్లిన లాకర్‌లో 250గ్రాముల బంగారం, సుమారు రూ.3లక్షలు నగదు ఉన్నట్టు తెలిసింది. ఈవిషయంపై బాధితుడు ఖనాపురం హవేలీ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### కృషి విజ్ఞాన కేంద్రానికి పురస్కారాల పంట




పురస్కారం అందుకుంటున్న రైతు రాణాప్రతాప్

వైరా, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): పంట రకాలు, రైతుల హక్కుల పరిరక్షణకుగాను వైరాలోని కృషి విజ్ఞాన కేంద్రానికి పురస్కారాల పంట పండింది. పంట రకాలు, రైతుల హక్కుల పరిరక్షణ కార్యక్రమం శుక్రవారం జహీరాబాద్‌లోని కృషి విజ్ఞాన కేంద్రంలో డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వైరా మండలం వల్లాపురం గ్రామానికి చెందిన ఆదర్శ రైతు తుమ్మ ల రాణాప్రతాప్, వేంసూరు మండలంలోని కందుకూరు గ్రామానికి చెందిన ఆదర్శ రైతు గొర్ల సత్యనారాయణరెడ్డికి వరిపంటకు చెందిన పూర్వరకాలను కాపాడటంలో ఆపంటలో కొత్తరకాల అభివృద్ధికిగానూ పురస్కారాలను ప్రదానం చేశారు. రైతులను ప్రోత్సహించి పూర్వ రకాలను కాపాడటంలో, ఆరకాల అభివృద్ధిలో ఎంతో కృషిచేస్తున్న వైరా కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ కె.రవికుమార్‌కు, శాస్త్రవేత్త పీఎస్ఎం.ఫణిశ్రీకి పురస్కారాలను అందజేశారు.

### నూతన ఎస్‌జీటీలకు ప్రత్యేక శిక్షణ

ఖమ్మం ఖానాపురంహవేలి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-24లో ఎంపికైన ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు మూడు రోజుల శిక్షణను శుక్రవారం నగరంలోని ఎస్ఎస్సీ, రిక్కాబజార్ పాఠశాలల్లో డీఈవో సోమశేఖర శర్మ ప్రారంభించారు. మొత్తం 310 మంది ఎస్‌జీటీలకు శిక్షణ అందించనున్నారు. ఈ శిక్షణా కార్యక్రమాన్ని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సందర్శించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

### 'అండర్‌పాస్‌ల ఎత్తు పెంచాలి'

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): పలు సమస్యలపై అధికారులకు రైతులు, సమీప ప్రాంత ప్రజలు విన్నవించిన నేపథ్యంలో కల్లూరు ఆర్డీవో మండలంలోని సదాశివునిపాలెంలోని గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారి నిర్మాణాన్ని శుక్రవారం పరిశీలించారు. సర్వే సమయంలో, మూడేళ్ల నుంచి నిర్మాణం సాగుతున్నప్పటి నుంచి అండర్‌పాస్‌ల విషయంలో పలుమార్లు విన్నవించామని, వ్యవసాయ ఉత్పత్తులను తరలించుకునేందుకు ఎత్తు అడ్డుగా ఉందని రైతులు వాపోయారు. కేవలం 8అడుగుల ఎత్తులో అండర్‌పాస్‌లు నిర్మించడం కారణంగా 14కిలోమీటర్లు మేర తిరిగి ఉత్పత్తులను తరలించాల్సిన పరిస్థితి ఏర్పడిందని, ఇదే సమస్యను అండర్‌పాస్‌లు పునాదులు సమయంలో వివరించామన్నారు.

### మానవ మేధస్సు ఓ కర్మాగారం: కలెక్టర్

ఖమ్మం ఖానాపురంహవేలి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): మానవ మేధస్సు ఓ కర్మాగారమని, ఆలోచనలు అందులోంచి ఉద్భవించే అద్భుతాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. శుక్రవారం నగరంలోని ఎస్‌బీఐటీ ఇంజనీరింగ్ కళాశాలలో జిల్లా స్థాయి ఐడియాథాన్ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కళాశాల చైర్మెన్ కృష్ణ మాట్లాడుతూ ఓ అద్భుతమైన ఆలోచన ప్రపంచ గతినే మారుస్తుందని, ఇంటర్నెట్ అందుకు సాక్ష్యమని అన్నారు.




ఆంధ్రజ్యోతి KHAMMAM CITY
శనివారం 1 మార్చి 2025
● ఖమ్మం ● రఘునాథపాలెం
● ఖమ్మం రూరల్
● తిరుమలాయపాలెం
● కూసుమంచి
● నేలకొండపల్లి ● కామేపల్లి
ఖమ్మం సిటీ
ZONE


# మెప్మా చేతికి కేఎంసీ పరిశుభ్రత

- కాంట్రాక్టర్ వ్యవస్థ నుంచి మెప్మాకు మార్పు
- 25మంది కార్మికులకు పెరగనున్న వేతనాలు
- నేటినుంచి టీఎల్ఎఫ్‌కు నిర్వహణ బాధ్యతలు

ఖమ్మంసంక్షేమవిభాగం, ఫిబ్రవరి28 (ఆంధ్రజ్యోతి): నేటినుంచి ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయం పరిశుభ్రత, నిర్వాహణ బాధ్యతలు మహిళల చేతిలోకి వెళ్లాయి. కొన్నేళ్లుగా కాంట్రాక్టు వ్యవస్థ ద్వారా కేఎంసీ కార్యాలయం నిర్వాహణ చేపడుతుండగా కార్మికులకు సరైన వేతనాలు అందటం లేదని కారణంతో ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య వ్యవస్థా పరంగా నిర్ణయం తీసుకున్నారు. దీంతో కాంట్రాక్టు వ్యవస్థ నుంచి టౌన్ లెవల్ ఫెడరేషన్(టీఎల్ఎఫ్)కు బాధ్యతలు అప్పగించారు.

**కార్మికులకు పెరగనున్న వేతనాలు**

ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయం నిర్వాహణ గతంలో కాంట్రాక్టర్ల ద్వారా నిర్వహించినా కూడా కాంట్రాక్టర్ ఎంపిక మాత్రం లాటరీ విధానంలో జరిగేది. పాలకవర్గం నిర్ణయం మేరకు అనుభవం కలిగిన కాంట్రాక్టర్‌కు కొంతమేర కమిషన్‌ను అందించి కాంట్రాక్టర్ ద్వారానే కేఎంసీ నిర్వహణ చేపట్టే కార్మికులకు వేతనాలను అందించారు. తర్వాత కాలంలో కాంట్రాక్టర్ల మధ్య పోటీతత్వం రావటంతో కార్యాలయం నిర్వహణకు కూడా టెండర్ విధానాన్ని అమలులోకి తీసుకొచ్చారు. ఏటకేడు పోటీ పెరుగుతోంది. ఈ నేపథ్యంలో గతేడాది 30శాతం తగ్గింపుతో ఓ కాంట్రాక్టర్ కేఎంసీ నిర్వాహణ కాంట్రాక్టును దక్కించుకున్నారు. కార్మికుల వేతనాలు ఒక్కోక్కరికి రూ.15 వేల వరకు ఇవ్వాల్సి ఉండగా సదరు కాంట్రాక్టర్ తాను 30శాతం లెస్‌గా వేశానని ఆ మేరకు కార్మికుల వేతనాలు తగ్గించారని ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో నెలకు రూ.9వేలు వేతనాలు ఇచ్చారని ఇటీవల కాలంలో కొంతమంది కేఎంసీ కార్మికులు కమిషనర్ అభిషేక్ అగస్త్య వద్దకు వెళ్లి కన్నీరు పెట్టుకున్నారు. తమకు గతంలో వచ్చిన వేతనాల కంటే ఈ సంవత్సరం తక్కువగా అందిస్తున్నారని వివరించారు. దీంతో స్పందించిన కమిషనర్ అభిషేక్ అగస్త్య విచారణ చేపట్టారు. ఖమ్మం నగర పాలక సంస్థ నిర్వహణను కాంట్రాక్ట వ్యవస్థ నుంచి మెప్మాకు మార్చి 1నుంచి టౌన్ లెవల్ ఫెడరేషన్(టీఎల్ఎఫ్)కు అప్పగించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలిచ్చారు. దీంతో శనివారం నుంచి మెప్మా పరిధిలోని మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా కేఎంసీ నిర్వాహణ జరగనుంది. దీంతో 25 మంది కార్మికులకు ఒక్కోక్కరికి నెలకు రూ.15వేల వరకు అందనున్నాయి. కేఎంసీ కార్మికులు శుక్రవారం మేయర్ పునుకొల్లు నీరజకు కమిషనర్ అభిషేక్ అగస్త్యను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.



## నేడు నగరంలో విద్యుత్ కోత

ఖమ్మంసంక్షేమవిభాగం, ఫిబ్రవరి28 (ఆంధ్రజ్యోతి): ఖమ్మంలో సబ్ స్టేషన్ మరమత్తులు కారణంగా శనివారం ఖమ్మం నగరంలో విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని డీఈ రామారావు ప్రకటించారు. ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఖమ్మంనగరంలోని బుర్హన్‌పురం, దాన్వాయిగూడెం, గాంధీచౌక్, ప్రకాష్‌నగర్, ఎన్ఎస్‌పీ క్యాంపు, జిల్లా ప్రభుత్వ హాస్పటల్, ఇల్లెందు క్రాస్‌రోడ్డు, రాపర్తినగర్, రఘునాథపాలెం, మరియు కోటపాడు, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు గమనించాలని విన్నవించారు.

## 'మీ సేవ' కేంద్రాల్లో విజిలెన్స్ తనిఖీలు

ఖమ్మంరూరల్, ఫిబ్రవరి28(ఆంధ్రజ్యోతి): టీజీఎస్‌టీఎస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా మీ సేవల్లో విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్ మెంట్ అధికారులు తనిఖీలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఏదులాపురం మున్సిపాలిటిపరిధిలోని కరుణగిరి ప్రాంతంలోని మీసేవా కేంద్రంలో శుక్రవారం తనిఖీలు చేపట్టారు. తహసీల్దార్ రాంప్రసాద్ సమక్షంలో మీసేవ కేంద్రంలోని రికార్డులను పరిశీలించారు. వివిధ ధ్రువీకరణ పత్రాలు, రిజిస్ట్రేషన్లకు ప్రభుత్వం నిర్ణయించిన ధరలే అమలవుతున్నాయా, లేకఅధికంగా వసూలు చేస్తున్నారా, మీసేవ కేంద్రం నుంచి ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం సకాలంలో జమ అవుతుందా లేదా అని రికార్డుల నిర్వహణ తీరు తదితర విషయాలపై తనిఖీలు చేపట్టారు. ప్రభుత్వ నిర్ధారించిన ధరల కంటే అధికంగా వసూలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏ సర్వీసెస్‌కు ఎంత ఫీజు వసూలు చేయాలో మీసేవకేంద్రాల్లో డిస్ ప్లే చేయాలన్నారు. వీటిలో ఏ నిబంధనను ఉల్లంఘించినా చర్యలు తప్పవని విజిలెన్స్ అధికారులు హెచ్చరించారు.


కరుణగిరిలో తనిఖీ చేస్తున్న అధికారులు

## బాలికలకు రక్షణ కల్పించాలని వినతి

ఖమ్మంసంక్షేమవిభాగం, ఫిబ్రవరి28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభ్యాసం చేస్తున్న బాలికలకు రక్షణ కల్పించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి వెంకటేష్ జిల్లా అదనపు కలెక్టర్ శ్రీజను కోరారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఇటీవల చోటు చేసుకుంటున్న పలు సంఘటనలు వివరించారు. నాయకులు వినయ్, సాధిక్, అశోక్, సురేశ్ పాల్గొన్నారు.

## రేపు ఉచిత కంటి వైద్యశిబిరం

నేలకొండపల్లి,ఫిబ్రవరి28(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నాచేపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు క్యాంప్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌లు గెల్లా జగన్‌మోహన్‌రావు, వెల్లంపల్లి శ్రీనివాస్ శుక్రవారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. నేలకొండపల్లి భక్తరామదాసు సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో లయన్ కంటి ఆసుపత్రి, వైరా వారిసహకారంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వైద్య శిబిరంలో అన్నిరకాల కంటి పరీక్షలను సంపూర్ణంగా నిర్వహిస్తారన్నారు. అర్హులైన పేదలకు అతితక్కువ ఖర్చుతో అన్ని రకాల కంటి ఆపరేషన్లు నిర్వహించనున్నట్లు చెప్పారు. తక్కువ ధరలకు కళ్ళద్దాలను అందించనున్నట్లు చెప్పారు. శిబిరానికి వచ్చే రోగులు ఆధార్ కార్డు లేదా, జిరాక్స్‌ను తీసుకుని రావాలని వారు ఆ ప్రకటనలో కోరారు.

## బూబూ రాజేంద్రప్రసాద్‌కు ఘన నివాళి


బాబూరాజేంద్రప్రసాద్ చిత్ర పటం వద్ద నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఖమ్మంసంక్షేమవిభాగం, ఫిబ్రవరి28 (ఆంధ్రజ్యోతి): రాజకీయాల్లో ఉన్నత స్థాయి విలువలు పాటించిన నాయకుడిగా దేశ తొలి రాష్ట్రపతి బాబురాజేంద్రప్రసాద్ చరిత్రలో నిలిచిపోయారని, విదేశీయులతోనూ మంచి ప్రశంసలు పొందారని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు కొనియాడారు. శుక్రవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో రాజేంద్రప్రసాద్ 62వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. రాజేంద్రప్రసాద్ చిత్రపటానికి పూలమాలలు వేసిన నాయకులు తర్వాత ప్రసంగించారు. కార్పొరేటర్లు దుద్దుకూరి వెంకటేశ్వర్లు, రాపర్తి శరత్‌కుమార్, కన్నవైష్ణవిప్రసన్న, నగర కాంగ్రెస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు నాగండ్ల దీపక్‌చౌదరి, జిల్లాకాంగ్రెస్ అనుబంధ సంఘాల అధ్యక్షులు దొబ్బల సౌజన్య, సయ్యద్ గౌస్ పాల్గొన్నారు.

## విద్యాలయాల్లో జాతీయ సైన్స్ దినోత్సవం



క్రియేటివ్‌లో..


శ్రీచైతన్యలో..


న్యూవిజన్‌లో..


సర్వజ్ఞలో..



త్రివేణిలో..


రెజోనెన్స్ శ్రీనగర్‌కాలనీలో..

## నానో ఎరువులపై రైతులు అవగాహన పెంచుకోవాలి

**జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య**

ఖమ్మంవ్యవసాయం,ఫిబ్రవరి28(ఆంధ్రజ్యోతి): నానోఎరువులపై రైతులు అవగాహన పెంచుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య పేర్కొన్నారు.శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఓఫంక్షన్ హాలులో ఇఫ్కో కంపెనీ ఆధ్వర్యంలో నానో యూరియా, నానో డీఏపీపై నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఇఫ్కో కంపెనీ ఇస్తున్న డ్రోన్ సర్వీసెస్‌ను వినియోగించుకోవాలని అన్నారు. ఇఫ్కోస్టేట్ మార్కెటింగ్ మేనేజర్ కృపశంకర్ మాట్లాడుతూ ఇఫ్కో నానో యూరియా ప్రపంచంలో మొదటిసారిగా ఇఫ్కో తీసుకోవచ్చిందన్నారు. ఇఫ్కో ఇన్సూరెన్సు, నానోవిలేజ్ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మార్కుఫెడ్ మేనేజర్ సునీత, ఇఫ్కోజిల్లా మేనేజర్ నాగార్జున, జిల్లా ఎరువులఅసోసియేషన్ అధ్యక్షుడు నాగేంద్రం, ఉమ్మడి ఖమ్మం, భద్రాద్రి జిల్లాల డీలర్స్ సొసైటీ సెక్రటరీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పుల్లయ్య

## రమణగుట్టలో ఆక్రమణల అడ్డగింత

ఖమ్మంమార్కెట్, ఫిబ్రవరి28 (ఆంధ్రజ్యోతి):నగరంలోని రమణగుట్ట ప్రాంతంలో గల ప్రభుత్వ భూమిని ఓ వ్యక్తి ఆక్రమించి షెడ్డు నిర్మిస్తున్నారని మాజీ కార్పొరేటర్,ఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు ఆరోపించారు. 57డివిజన్‌లోని 64సర్వే నెంబర్‌లో గల 840 గజాల ప్రభుత్వ స్థలాన్ని స్థానిక కార్పొరేటర్ భర్త ఆక్రమించుకొని ప్లాట్లుగా చేసి అమ్మకాలు జరుపుతున్నారని తెలిపారు.సదరు స్థలాన్ని 2018లో మహాత్మా గాంధీ పూలే కమ్యూనిటీ హాలు, ప్రభుత్వ పాఠశాల నిర్మాణానికి నాటి తహసీల్దార్ కేటాయించారన్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలన్నారు.

## పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

ఖమ్మంఖానాపురంహవేలి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మార్చి 5 నుంచి జరగనున్న ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఇంటర్మీడియట్ బోర్డు డిప్యూటీ సెక్రటరి సీహెచ్ యాదగిరి అన్నారు. శుక్రవారం నూతన కలెక్టరేట్ కార్యాలయంలో ఛీఫ్ సూపరెండెంట్, డిపార్ట్‌మెంట్ అధికారులకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పరీక్షల నిర్వాహణకు పలు సూచనలు చేశారు. ప్రతీ ఒక్కరు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని అన్నారు. జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవిబాబు మాట్లాడుతూ విద్యార్థులు ప్రశాంత వాతారణంలో పరీక్షలు రాసే విధంగా వసతులు కల్పించాలన్నారు. ఈ సమావేశంలో డీఈసీ మెంబర్స్ కుంతుబాక శ్రీనివాసరావు, సింహాచలం, వీరభద్రరావు, హైపవర్ కమిటీ సభ్యులు విజయకుమారి, శంకర్ పాల్గొన్నారు. అనంతరం యాదగిరి ప్రభుత్వ బాలికలు జూనియర్ కళాశాలను సందర్శించారు.

## పారిశుధ్య కార్మికుడుడి అరుదైన గౌరవం

ఖమ్మంసంక్షేమ విభాగం,ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలో పారిశుధ్య కార్మికుడిగా 20ఏళ్ల పాటు పనిచేసి పదవీ విరమణ పొందిన కార్మికుడు సీహెచ్ రామ్‌పాదానికి అరుదైన గౌరవం దక్కింది. శుక్రవారం కేఎంసీలో నిర్వహించిన కార్యక్రమంలో కమిషనర్ అభిషేక్ అగస్త్య రామ్‌పాదం దంపతులను ఘనంగా సన్మానించారు. వారికి రావాల్సిన పదవీ విరమణ బెనిఫిట్స్ అందించారు. తర్వాత కేఎంసీ వాహనంలో దంపతులను గౌరవంగా వారి ఇంటి వద్దకు పంపారు. ఈ సందర్భంగా కమిషనర్ అభిషేక్ అగస్త్య మాట్లాడుతూ కష్టపడి పనిచేసే వారు ఏ హోదాలో ఉన్న వారికి సరైన గౌరవం దక్కుతుందన్నారు.

**రిటైర్డ్ ఉద్యోగులకు కలెక్టర్ సన్మానం**

ఖమ్మంకలెక్టరేట్: 30ఏళ్లుగా ప్రభుత్వ ఉద్యోగులుగా పని చేస్తూ ప్రజలకు నిర్విరామంగా అందించిన మీ సేవలకు అభినందనం అని" కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పదవీ విరమణ పొందిన 15 మంది అధికారులు, సిబ్బందిని సత్కరించారు.

## ఘనంగా టైలర్స్ డే

ఖమ్మంవ్యవసాయం,ఫిబ్రవరి28 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం వాసవి క్లబ్ అధ్యక్షుడు, 36 డివిజన్ కార్పొరేటర్ పసుమర్తి రామ్మోహన్‌రావు ఆధ్వర్యంలో శుక్రవారం టైలర్స్ డేను ఘనంగా నిర్వహించారు. టైలర్స్ ఓనర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు తోట రంగారావును, అధ్యక్షుడు రామగిరి వెంకటేశ్వర్లు కోశాధికారి రామగిరి నగేష్ కార్యవర్గ సభ్యులులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ సెక్రటరీ వెచ్చా కృష్ణమోహన్, వాసవి క్లబ్ ట్రెజరర్ పసుమర్తి శ్రీనివాసరావు పాల్గొన్నారు.


యూనియన్ నాయకులను సన్మానిస్తున్న కార్పొరేటర్ పసుమర్తి

## జర్నలిస్టుల ఇళ్ల సమస్యపై ముఖ్యమంత్రిని కలుస్తాం

ఖమ్మంకలెక్టరేట్, ఫిబ్రవరి28 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యపై సీఎం రేవంత్‌రెడ్డిని కలుస్తామని టీయూడబ్ల్యూజే(ఐజేయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రాంనారాయణ, టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు ఆకుతోట ఆదినారాయణ, టీజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు పల్లా కొండల్‌రావు అన్నారు. శుక్రవారం జడ్పీ అతిథి గృహంలో జిల్లా కేంద్ర పాత్రికేయుల ముఖ్యుల సమావేశంలో వారు మాట్లాడారు. ఇళ్లస్థలాల సమస్యను రాష్ట్ర సమస్యగా భావిస్తున్నట్లు చెప్పారు.

**టీయూడబ్ల్యూజే(ఐజేయూ) సభ్యత్వ నమోదు**

ఖమ్మంచర్చికాంపౌండ్, ఫిబ్రవరి28(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే టీయూడబ్ల్యూజే(ఐజేయూ)ఆయూనియన్ రాష్ట్రప్రధాన కార్యదర్శి కట్టెకోల రాంనారాయణ అన్నారు. శుక్రవారం జిల్లా పరిషత్ మీటింగ్ హాల్‌లో ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గస్థాయి సభ్యత్వ నమోదును ప్రారంభించారు. శుక్రవారం సుమారు వందమందికిపైగా జర్నలిస్టులకు సభ్యత్వ నమోదు అందించారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే(ఐజేయూ) రాష్ట్ర కమిటీ సభ్యుడు మాటేటి వేణుగోపాల్,జిల్లా అధ్యక్షుడు వనం వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఏనుగు వెంకటేశ్వరరావు, నగర అధ్యక్షుడు మైసా పాపారావు, ప్రధాన కార్యదర్శి చెరుకుపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## పాలేరు పాతకాల్వకు వారబందీ ఎత్తివేయాలి

కూసుమంచి, ఫిబ్రవరి28(ఆంధ్రజ్యోతి): పాలేరు జలాశయం పరిధిలోని పాతకాల్వకు వారబందీ పద్దతి రద్దుచేసి నిరంతరాయంగా సాగునీరు అందించాలని సీపీఎం జిల్లా అధ్యక్షుడు మాదినేని రమేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం పాలేరు పాతకాల్వను మండల రైతు సంఘనేతలతో కలిసి సందర్శించారు. పాతకాల్వకింద సుమారు 25వేల ఎకరాల ఆయకట్టు ఉందన్నారు. గతఏడాది ఇలానే వారబందీ విధానంతో వేలాది ఎకరాలు పంటలు ఎండిపోయాయని గుర్తు చేశారు. పాలేరు చెరువును జలాశయంగా మార్చేసమయంలో పాతకాల్వ రైతులకు నీరందించిన తర్వాతే దిగువకు ఇచ్చేవిధంగా ఆనాడు పాలకులు నిబంధనలు విధించారని గుర్తుచేశారు. రైతులు పంటలు వేసుకోవడానికి అంగీకరించిన అధికారులు.. తర్వాత పంటలు ఎండిపోతున్నా పట్టించుకోకపోవడం దురదృష్టకరమని అన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష కార్యదర్శులు తోటకూరి రాజు, బిక్కసాని గంగాధర్, మల్లెల షన్మతిరావు, యడవల్లి రమణారెడ్డి, కుటుంబరావు, పందిరి వీరారెడ్డి పాల్గొన్నారు.

## టీఎన్జీవోస్ మెడికల్ ఫోరం సెంట్రల్ యూనియన్ డైరీ ఆవిష్కరణ

ఖమ్మంకలెక్టరేట్, ఫిబ్రవరి28(ఆంధ్రజ్యోతి): టీఎన్జీవో మెడికల్ ఫోరం సెంట్రల్ యూనియన్ డైరీని శుక్రవారం హైదరాబాదులో డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ ఆడిటోరియంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు మారం జగదీశ్వర్ మాట్లాడుతూ అన్ని శాఖల కన్నా వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగుల సంఖ్య అధికమని సమస్యలు కూడా ఎక్కువగా ఉన్నాయని వాటి పరిష్కారంలో టీఎన్జీవోస్ యూనియన్ వైద్యఆరోగ్యశాఖ ఉద్యోగులకు అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా టిఎన్జీవోస్ జిల్లా అధ్యక్షులు గుంటుపల్లి శ్రీనివాసరావు, జడ్ .ఎస్ జైపాల్ విజయ్ కుమార్, ఉపాధ్యక్షుడు కరణ్ సింగ్, జాయింట్ సెక్రటరీ తాళ్లూరి శ్రీకాంత్, ఏలూరి హరికృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ పెద్దినేని రాధాకృష్ణ, ఖమ్మం రూరల్ యూనిట్ కార్యదర్శి లింగమూర్తి , రఘునాధపాలెం యూనిట్ కార్యదర్శి జాబిశెట్టి శ్రీనివాసరావు, మధిర యూనిట్ అధ్యక్షులు గుర్రం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



## 44వ డివిజన్‌లో మసీద్ ప్రారంభోత్సవం


కార్పొరేటర్ పాలేపు విజయను సన్మానిస్తున్న దృశ్యం

ఖమ్మంసంక్షేమవిభాగం, ఫిబ్రవరి28(ఆంధ్రజ్యోతి): ముస్లీం, మైనార్టీల హక్కులను కాపాడేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడు అండగా ఉంటుందని, మత సామరస్యంగా రంజాన్ మాసం వేడుకలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని 44వ డివిజన్ కార్పొరేటర్ పాలేపు విజయ పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని శ్రీరామ్‌నగర్‌లో నూతనంగా నిర్మాణం జరిపిన మసీద్‌ను కార్పొరేటర్, ముస్లీం మత పెద్దలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ముస్లీం మత పెద్దలు కార్పొరేటర్ దంపతులను సన్మానించారు.

## సీబీఎస్ఈ ఉపాధ్యాయులకు శిక్షణ

ఖమ్మం ఖానాపురంహవేలి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): నగరంలోని హార్వెస్ట్ పాఠశాలలో శుక్రవారం సెంట్రల్ బోర్డు ఆఫ్ సెంకడరీ ఎడ్యుకేషన్ ఢిల్లీ వారి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు రెండు రోజుల శిక్షణా తరగతులను ప్రారంభించామని పాఠశాల ప్రిన్సిపాల్ పార్వతీరెడ్డి తెలిపారు. ఈ శిక్షణను బోర్డు రిసోర్స్ పర్సన్స్‌గా ఇనిస్టిట్యూట్ ఆఫ్ సెక్రటేరియట్ అండ్ మేనేజ్‌మెంట్ డిప్యూటీ డైరెక్టర్ జితేందర్ భట్టి, ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఇన్ గవర్నమెంట్ త్రివేండ్రం బి ప్రసన్నకుమార్, మోడల్ స్కూల్ హైద్రాబాద్ ప్రిన్సిపాల్ పల్లవి శిక్షణ అందించనున్నారు. మొత్తం 65 మంది ఉపాధ్యాయులు శిక్షణకు హాజరైనట్లు తెలిపారు. శిక్షణ అనంతరం బోర్డు సర్టిఫికెట్లు అందిస్తామని చెప్పారు.




ఆంధ్రజ్యోతి
- మధిర, ఎర్రుపాలెం, బోనకల్, చింతకాని, ముదిగొండ
- వైరా, కొణిజర్ల, కారేపల్లి, ఏన్కూరు, జూలూరుపాడు
- సత్తుపల్లి, కల్లూరు, తల్లాడ, వేంసూరు, పెనుబల్లి

ZONE
శనివారం 1 మార్చి 2025
వైరా-మధిర
సత్తుపల్లి
WYRA, MADHIRA, SATHUPALLY



## ఉచిత వైద్యంతో పాటు శస్త్రచికిత్సలు చేస్తాం

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఉచిత పశు వైద్య శిబిరాలలో వైద్యంతో పాటు శస్త్ర చికిత్సలు చేస్తామని కాకర్లపల్లి పశువైద్యాధికారి డాక్టర్ శశిదీప్ అన్నారు. శుక్రవారం మండలంలోని తాళ్లమడలో గోపాలమిత్ర గర్భకోశ వ్యాధి చికిత్స శిబిరం నిర్వహించారు. ఉచితంగా నిర్వహించే శిబిరాల ద్వారా ఎదకు రాని, చూలు కట్టని పశువుల గర్భకోశ వ్యాధులకు పరీక్షలు చేయించాలని, గొర్రెలకు ఉచితంగా బొబ్బవ్యాధి నివారణ టీకాలు అందిస్తామని చెప్పారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన కేవలం ఆడదూడలు పుట్టే.. లింగ నిర్ధారణ చేసిన సెక్స్ సార్టెడ్ సేమెన్ అందుబాటులో ఉందని, దీనిని రైతు సోదరులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గర్భకోశం ఎదగకపోవడంతో కొన్ని పశువుల్లో మొదటి ఎద వయస్సు వచ్చినా సరే ఎదకు రాకుండా ఉంటాయని తెలిపారు.

## అంజయ్య సేవలు ఆదర్శప్రాయం: ఎంఈవో



మాట్లాడుతున్న ఎంఈవో పుల్లయ్య

బోనకల్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): అంకితభావంతో పని చేసిన చిరునోముల ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వాసంశెట్టి అంజయ్య సేవలు ఆదర్శప్రాయమని ఎంఈవో డి.పుల్లయ్య ప్రశంసించారు. స్థానిక సాయిబాబా దేవాలయంలో శుక్రవారం నిర్వహించిన అంజయ్య ఉద్యోగ విరమణ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఉద్యోగ జీవితం ప్రారంభం నుంచి విరమణ వరకు బాధ్యతను విస్మరించలేదన్నారు. సౌమ్యుడిగా, పనిలో అలుపెరగని కార్యదీక్షకుడిగా అందరి మన్ననలను పొందారని తెలిపారు. మంచి ఉపాధ్యాయుడు దిగిపోతున్నందుకు చాల బాధగా ఉందని ఉద్వేగానికి లోనయ్యారు. యూటీఎఫ్, పీఆర్టీయు జిల్లా నాయకులు వల్లంకొండ రాంబాబు, రవి కుమార్ మాట్లాడుతూ అందరితో సత్సంబంధాలను కలిగి, ఉద్యోగ విరమణ వరకు పాఠశాలకు వచ్చి సేవలందించిన అంజయ్య స్ఫూర్తి అభినందనీయమన్నారు. అనంతరం ఫించన్ బెనిఫిట్ పత్రాలను ఎంఈవో, ఉపాధ్యాయ సంఘాల నాయకులతో కలిసి అందజేశారు. ఉపాధ్యాయులు, స్నేహితులు, బంధువులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి గుగులోతు రామకృష్ణ, రంగారావు, కర్నాటీ కవిత, సదాబాబు, పీఆర్టీయు నాయకులు కొమ్ము శ్రీనివాసరావు, కొనకంచి రామ్మోహన్, మద్దినేని వెంకటేశ్వరరావు, రత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్వోబీ కూడలిలో రింగ్‌కు మోక్షమెన్నడో..?

### లైటింగ్, మెట్ల సౌకర్యం ఏర్పాటు చేయాలని వేడుకోలు

### తాత్కాలికంగా హోర్డింగులైనా ఏర్పాటు చేయాలని వినతి



లైటింగ్‌కు నోచుకోని ఆర్వోబీ ఇదే..

బోనకల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): బోనకల్ రైల్వేగేటు పై గత 2009లో ఆర్వోబీని నిర్మించారు. దీంతో బోనకల్, బోనకల్ స్టేషన్ ప్రాంతం వాహనాల రాకపోకలకు సంబంధించి రెండు భాగాలుగా విడిపోయాయి. విజయవాడ, హైదరాబాద్ నుంచి భారీ వాహనాలతో పాటు కార్లు, బస్సు సర్వీసులు నిత్యం బోనకల్ ఆర్వోబీ మీదుగా రాకపోకలు సాగిస్తుంటాయి. వాహనాల రద్దీ ఎక్కువగా ఉండటంతో పాటు మండలంలోని పలు గ్రామాల ప్రజలు ఈ మార్గం వద్ద ఉన్న కూడలి నుంచి వేర్వేరు ప్రాంతాలకు ప్రయాణిస్తుంటారు. బోనకల్ గ్రామ పంచాయతీ కార్యాలయం పక్కనే గ్రామంలోకి వెళ్లే రోడ్డు, ఆర్వోబీకి రెండు వైపుల సర్వీసు రోడ్లు, వైరా-జగ్గయ్యపేట ప్రధాన రహదారి మార్గం పై ఒక్కటే చోట కలుస్తుండటంతో వాహనదారులకు ప్రమాదాల గండం పొంచి ఉంది. 8 ఏళ్ల క్రితం ఈ మార్గం వద్దనే జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ



రింగ్ రోడ్డు ఏర్పాటుచేయాల్సిన చౌరాస్తా

వ్యక్తి మృతి చెందాడు. వేగంతో వస్తున్న వాహనాల వలన సర్వీసు రోడ్లు, బోనకల్ గ్రామం నుంచి రోడ్డు పైకి చేరుకునే వారికి ప్రయాణం నరకయాతనగా మారింది, బోనకల్ సినిమా హాల్ ఎదురుగా ఉన్న ప్రాంతంలో రింగు ఏర్పాటు చేస్తే ప్రమాదాలకు పూర్తి అడ్డుకట్ట పడే అవకాశం ఉందని ప్రజలు భావిస్తున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా ప్రజా ప్రతినిధులకు వినతి పత్రాలు ఇచ్చినా ఫలితం లేదు. ప్రజా ప్రభుత్వంలోనైనా రింగు ఏర్పాటు చేయాలని వాహనదారులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

### లైటింగ్, మెట్ల సౌకర్యం ఏర్పాటు చేయాలని..

ఆర్వోబీకి లైటింగ్, మెట్ల సౌకర్యం లేకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు లోనవుతున్నారు. రాత్రి వేళల్లో ప్రయాణీకులు ఈ మార్గం నుంచి ప్రయాణించడానికి నానా అవస్థలు పడుతున్నారు. ఆర్వోబీ ప్రవేశం వద్ద ప్రమాదాలను నివారించడానికి తాత్కాలింగానైనా హోర్డింగులను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి తక్షణమే ప్రమాదాలను నివారించే చర్యలు చేపట్టాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

## బీఆర్ఎస్ బీమా చెక్కు అందజేత

ముదిగొండ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ముదిగొండ మండలం వనంవారిక్రిష్టాపురం గ్రామానికి చెందిన షేక్.మీరాసాహెబ్ ఇటీవల మృతిచెందగా అతడికి బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వం ఉండటంతో మంజూరైన రూ.రెండులక్షల బీమా చెక్కును మాజీ జడ్పీచైర్మన్ లింగాల కమల్‌రాజ్ శుక్రవారం బాధిత కుటుంబానికి అందజేశారు. అనంతరం మాజీ ఎంపీపీ సామినేని హరిప్రసాద్ సతీమణి నాగమణి ఇటీవల మృతిచెందగా ఆమె చిత్రపటానికి కమల్‌రాజ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. హరిప్రసాద్‌ను పరామర్శించి సానుభూతి తెలిపారు.

## నేడు 'డయల్ యువర్ డీఎం'

సత్తుపల్లి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి ఆర్టీసీ ఆధ్వర్యంలో శనివారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ యూ.రాజ్యలక్ష్మీ శుక్రవారం తెలిపారు. సాయంత్రం 4గంటల నుంచి 5గంటల వరకు ప్రయాణీకులు తమ విలువైన సలహాలు, సూచనలను 9959225962 కు డయల్ చేసి తెలపాలని ఆమె కోరారు.

## ఎన్టీఆర్ నగర్ మజీద్ సదర్‌గా ముజ్జు

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎన్టీఆర్ నగర్ మజీద్ సదర్‌గా ముజ్జు (ఎండీ.ముజిబర్ రహమాన్) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం మసీద్ వద్ద నూతన కమిటీని ఎన్నుకున్నారు.

## శ్రీనివాస్ మృతికి ఓసీ కార్మికుల సంతాపం

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఇటీవల మృతిచెందిన మండలంలోని కిష్టారం ఓసీ కార్మికులు బొడ్డు శ్రీనివాస్ మృతికి కార్మికులు, అధికారులు, సిబ్బంది సంతాపం వ్యక్తంచేశారు. శనివారం ఓసీలో నిర్వహించిన కార్యక్రమంలో ఏఐటీయూసీ ఫిట్ సెక్రటరీ కిషోర్‌కుమార్ మాట్లాడారు. కాలరీ మేనేజర్ రామకృష్ణ, నాయకులు భరణి, బాలాజీ పాల్గొన్నారు.

## తనికెళ్లలో ఉత్సాహంగా వసంతోత్సవం

కొణిజర్ల,ఫిబ్రవరి28(ఆంధ్రజ్యోతి): శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు శివపార్వతుల కల్యాణ మహోత్సవం జరగగా, రెండవ రోజు ఎదుర్కోల్లు, మూడవ రోజు శుక్రవారం మండల పరిధిలోని తనికెళ్ల చంద్రమౌళేశ్వరస్వామి ఆలయం ఆధ్వర్యంలో వసంతోత్సవాన్ని నిర్వహించారు. ఉదయం పూల వసంతోత్సవం నిర్వహించి సాయంత్రం వేళ ఆలయంలో దొంగలదోపిడి, నాగవల్లి వంటి కార్యక్రమాలను నిర్వహించారు. మూడు రోజుల పాటు గ్రామంలో స్వామి వారి ఊరేగింపు జరిగింది.

## ఘనంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

తల్లాడ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలం అన్నారుగూడెంలోని సద్గురు షిర్డీసాయిబాబా దేవాలయ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం మహాఅన్నదాన కార్యక్రమాన్ని రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు మారెళ్ల లక్ష్మణ్‌రావు, దుగ్గినేని గోపయ్య, మధు, పూనాటి సత్యం, తుమ్మలపల్లి రమేష్, ఆపతి రామారావు, దారా విష్ణుమోహన్‌రావు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కాపా సుధాకర్, నాయకులు కొమ్మినేని వెంకటేశ్వర్లు(కేవీ), గోవిందు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## ముగిసిన కోటిలింగాల జాతర

కారేపల్లి, ఫిబ్రవరి28(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పోలంపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో గతమూడు రోజులుగా కొనసాగుతున్న కోటిలింగాల జాతర శుక్రవారం ముగిసింది. మహాశివరాత్రి సందర్భంగా నిర్వహించే జాతరకు ఖమ్మం జిల్లా నుంచే కాకుండా పరిసర జిల్లాలకు చెందిన వేలాదిమంది జాతరకు తరలివచ్చి స్వయంభగా వెలిసినశివలింగాన్ని దర్శించుకుంటారు.

## ఉపాధిహామీ ఓపెన్ ఫోరం

కల్లూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీడీవో చంద్రశేఖర్ అధ్యక్షతన ఉపాధి హామీ ఓపెన్ ఫోరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పనుల్లో రికార్డుల నిర్వహణ, మస్టర్ జాబితాల నమోదులో లోపాలను అధికారులు గుర్తించారు. 16 విడతగా జరిగిన ఉపాధి హామీ సామాజిక తనిఖీలో భాగంగా పలు గ్రామాల పంచాయితీల నుంచి రూ.26 వేలు పెనాల్టీతో పాటుగా రూ.6.4852 నగదును రికవరీ చేయటం జరిగిందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ పీడీ సిహెచ్ శ్రీనివాసరావు, డీవీవో సక్రియా, అంబుడ్స్‌మెన్ రమేష్ బాబు, అసిస్టెంట్ విజిలెన్స్ మేనేజర్ పవన్, విజిలెన్స్ సూపరింటెండెంట్ శశిధర్‌శాస్త్రి, ఏపీడీ వెంకటపతిరాజు, మండల ఉపాధి హామీ ఏపీవో హేమమాలిని, ఇంజనీర్ పుల్లారావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## మునగ సాగుతో రూ.2లక్షల ఆదాయం

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): రైతులు మునగ సాగుతో ఎకరానికి రూ.2లక్షల ఆదాయం పొందవచ్చునని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి కిషోర్ అన్నారు. శుక్రవారం ఆయన సత్తుపల్లి మండలంలోని గంగారం, సత్యానారాయణపురం గ్రామాలలో నర్సరీలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా రైతులకు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్న లక్ష మునగ మొక్కలను పరిశీలించారు. రైతులకు మునగ మొక్క ఒకటి రూ.10చొప్పున రవాణా ఖర్చుతో కలిపి రూ.15ధరతో సరఫరా చేసేందుకు సిద్దంగా ఉన్నామన్నారు. అయితే ఎకరానికి వెయ్యి మొక్కలు నాటితే ప్రతి మొక్కకు కనీసం వంద కాయలు వస్తాయన్నారు. అలాగే ఆకులను సైతం ఎండబెట్టి పొడిని ప్యాకెట్లలో నింపినా అదనపు ఆదాయం వస్తుందని ఆయన పేర్కొన్నారు.

## చేతి వృత్తిదారులకు ప్రభుత్వం అండ: ఎమ్మెల్యే



ఎమ్మెల్యేని సన్మానిస్తున్న టైలర్లు

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): చేతి వృత్తిదారులకు ప్రభుత్వం అండగా ఉంటుందని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. టైలర్స్ డే సందర్భంగా శుక్రవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కేక్ కట్‌చేసి మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా టైలర్స్ అసోసియేషన్ భవనం నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని కేటాయించాలని ఎమ్మెల్యేను టైలర్స్ కోరారు. టైలర్స్ డే సందర్భంగా సత్తుపల్లి పట్టణంలో టైలర్స్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కళాభారతిలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ పాల్గొని మాట్లాడుతూ స్వయం ఉపాధి మీద జీవనం సాగించే టైలర్స్ ఏకతాటిపైకి వచ్చి హక్కులను సాధించుకోవాలని కోరారు. అదేవిధంగా కుట్టుమిషన్ రూపకర్త విలియమ్స్ హావే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

### పెనుబల్లిలో..

పెనుబల్లి: అంతర్జాతీయ టైలర్స్‌డే సందర్భంగా వీఎంబంజర్‌లో శుక్రవారం టైలర్స్‌డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దర్జీ సంక్షేమానికి ప్రభుత్వాలు కృషిచేయాలని వ్యవసాయ కార్మికసంఘం జిల్లా కమిటీ సభ్యుడు గాయం తిరుపతిరావు అన్నారు. వీఎంబంజర్‌లోని రింగ్ సెంటర్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో టైలర్స్‌డే కార్యక్రమాన్ని తాండ్ర రాజేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. టైలర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు షేక్.బాషా, గాయం తిరుపతిరావు మాట్లాడుతూ టైలరింగ్ రంగంపై ఆధారపడి జీవిస్తున్న కార్మికులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో మహిళా సంఘం మండల కార్యదర్శి మిట్టపల్లి నాగమణి, బాజీ నాగేశ్వరరావు, సత్యనారాయణ, షేక్.అబ్దుల్, బుర్రి వెంకటేశ్వరరావు, జానీ, గౌస్, అబ్దుల్ గఫూర్, బాలకృష్ణ, సుబ్బారావు, తడికమళ్ల చిరంజీవి, కంటే సత్యం పాల్గొన్నారు.

# దారులన్నీ తిరునాళ్ల వైపే



సత్యహరిచంద్ర నాటిక ప్రదర్శన

మధిరటౌన్, ఫిబ్రవరి28(ఆంధ్రజ్యోతి): మధిర పట్టణంలో మహాశివరాత్రి సందర్భంగా శ్రీ గంగా పార్వతీ సమేత శ్రీ మృత్యుంజయ స్వామి దేవాలయం వద్ద జరుగుతున్న తిరునాళ్లకు భక్తులు కనీవినీ ఎరుగని విధంగా శుక్రవారం హాజరయ్యారు. శివాలయం కు వచ్చే దారులన్నీ భక్త జనసందోహంతో నిండి పోయాయి, దాదాపు ముప్పయి వేల మంది ప్రజలు తిరునాళ్ల తిలకించేందుకు హాజరు కావడంతో ఆలయ పరిసరాలు అన్ని కిక్కిరిసి పోయాయి. ఆలయం వద్ద మధిరకు చెందిన సుమిత్ర యూత్ అసోసియేషన్ వారు ప్రదర్శించిన సత్యహరిశ్చంద్ర నాటకం ఆహుతలను అలరించింది. మధిర సీఐ మధు ఆధ్వర్యంలో మధిర, ఎర్రుపాలెం, బోనకల్ ఎస్ఐ లు తిరునాళ్లలో ఎటువంటి అవాంచనీయ సంఘటనలూ జరగకుండా బందోబస్తు నిర్వహించారు.

# మాలలు మరో పోరాటానికి సిద్ధం కావాలి



మాట్లాడుతున్న సుధాకర్

ముదిగొండ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణను ఆమోదింపజేసి మాలలకు అన్యాయం జరిగేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చూస్తున్నాయని, దానిని వ్యతిరేకించి మాలలు మరో పోరాటానికి సిద్ధం కావాలని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ పిలుపునిచ్చారు. శుక్రవారం ముదిగొండలో జిల్లా అధ్యక్షుడు ఉండేటి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధతకు పూనుకున్న రాష్ట్ర ప్రభుత్వం రాజ్యాంగ వ్యతిరేక చర్యలను ఎండగట్టాలని ఆయన పిలుపునిచ్చారు. అసెంబ్లీ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం చూస్తోందని ఆరోపించారు. అంబేద్కర్ వారసులలైన మాలలను విస్మరించి మందకృష్ణ మాదిగకు తొత్తుగా వ్యవహరిస్తూ వర్గీకరణను అమలు చేసేందుకు చూస్తుందని దుయ్యబట్టారు. ఈ వర్గీకరణ అమలైతే మాలలు, మాదిగలను విడగొట్టే ఉద్దేశ్యంతో అన్ని రాజకీయ పార్టీలు వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. వర్గీకరణ బిల్లును అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెట్టకుండా మాలలందరూ ఐక్యంగా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రధాన సెంటర్ నుంచి సభా ప్రాంగణం వరకు ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఉండేటి శ్రీనివాస్, జాతీయ మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి వేల్పుల జానయ్య, మాలమహానాడు నాయకులు వేల్పుల లక్ష్మణ్‌రావు, రామనాథం, రమణమూర్తి, కందుల ఉపేందర్, మధు, కనకయ్య, తోటమళ్ల భరత్, శ్రీరాములు, రాంబాబు, కొమ్ము నర్సింహారావు పాల్గొన్నారు.

# ఘనంగా సైన్స్ డే వేడుకలు

సైన్స్ డే వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వివిధ పాఠశాలలు, కళాశాలల్లో వేడుకలు నిర్వహించారు. సర్ సీవీ రామన్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్, వకృత్వ పోటీలు నిర్వహించారు. సైన్స్ దేను పురస్కరించుకుని విద్యార్థులు ప్రదర్శించిన ప్రయోగాలు పలువురిని ఆకట్టుకున్నాయి.




మదర్ థెరిస్సా కళాశాలలో రక్తదానం




సత్తుపల్లి జేవీఆర్ కళాశాలలో..



ఎర్రుపాలెంలో..



ముదిగొండలో..



తల్లాడలో విద్యార్థుల నమూనా



వైరా వాణి వివేకానందలో..



కల్లూరు బాలాజీ పాఠశాలలో..



మధిర మండలం మడుపల్లి పాఠశాలలో..